RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 144 ISSUE NO : 144 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శుక్రవారం,నవంబర్,28,2025 Friday,November,28,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4/-



## కేసీఆర్ అలా.. రేవంత్‌రెడ్డి ఇలా..

## ఇద్దరి ఆలోచనలో ఎంత

# వ్యత్యాసం

హైదరాబాద్,తెలంగాణ దిశ : కేసీఆర్.. అలియాస్ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు.. తెలంగాణ ఉద్యమ సారథి. ప్రత్యేక రాష్ట్రానికి పదేళ్లు సీఎం. టీడీపీ నుంచే రాజకీయ ఓనమాలు నేర్చుకున్న కేసీఆర్.. తర్వాత పార్టీని వీడి.. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా టీఆర్ఎస్ ప్రస్తుతం బీఆర్ఎస్ స్థాపించాడు. తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమి ంచారు. సబ్బండ వర్గాలను ఏకం చేశాడు. సకల జనుల పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్ర కల సాకారమైంది. ప్రత్యేక రాష్ట్రంలో తెలంగాణ ప్రజలు పదేళ్లు కేసీఆర్‌కు అధికారం ఇచ్చారు. తనవంతు బాధ్యతగా ఆయన తెలంగాణను చాలా అభివృద్ధి చేశారు. అయితే కేసీఆర్ ఆలోచనా విధానం అంతా నేనే.. అన్నట్లుగా ఉంటుంది. పదేళ్ల తర్వాత తెలంగాణను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇక్కడ అధికారం లోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి.. ఈయన కూడా టీడీపీలో రాజకీయ ఓనమాలు నేర్చుకున్నారు.



## బతుకమ్మకుంట వ్యవహారం

## హైడ్రా కమిషనర్‌పై

# హైకోర్టు ఆగ్రహం

## డిసెంబర్ 5లోపు కోర్టు ఎదుట హాజరుకు ఆదేశం

హైదరాబాద్,నవంబర్ 27 : హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంట వివాదంలో డిసెంబర్ 5వ తేదీ లోపు కోర్టు ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలని ఏవీ రంగనాథ్‌ను ఆదేశించింది. లేకుంటే నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తామని హైకోర్టు హెచ్చరించింది. బతుకమ్మకుంట వ్యవహారంలో హైకోర్టుకు ఏవీ రంగనాథ్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో ఆయనపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంటలోని ప్రైవేట్ స్థలంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి మార్పులు చేర్పులు చేయవద్దంటూ ఈ ఏడాది జూన్12వ తేదీన కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉల్లంఘిం చారంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి చర్యలు తీసుకో వద్దంటూ ఆయన సూచించింది. అంతేకాకుండా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలంటూ రంగనాథ్‌ను ఆదేశించింది.



## కోర్టు ఏం మ్యాజిక్

# చేయగలదు

## ఢిల్లీ పొల్యూషన్‌పై సుప్రీంకోర్టు

ఢిల్లీ : ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకు దిగజారిపో తున్నది. ఈ క్రమంలో ఢిల్లీలో కాలుష్య కట్టడి కోరుతూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించిన సుప్రీంకోర్టు డిసెంబర్ 3న విచారించనున్నట్లు తెలిపింది. ఈ కాలుష్య సమస్యను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. అయితే పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఇది ఆరోగ్య అత్యవసర పరిస్థితి అని సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్ చేసిన వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది. 'కాలుష్యం విషయంలో కోర్టు ఏం మ్యాజిక్ చేయగలదు..' అని ఈ సందర్భంగా న్యాయస్థానం ప్రశ్నించింది. 'ఒక న్యాయస్థానం ఏం మాయాజాలం చేయగలదు? ఢిల్లీ-ఎన్‌సీఆర్‌కు ఇది ప్రమాదకరమని తెలుసు. అయితే పరిష్కారం ఏమిటనేది ఇక్కడ ముఖ్యం. దీనికి గల కారణాలను గుర్తించాలి. పరిష్కారాలు కేవలం ఆ రంగంలోని నిపుణుల నుంచే లభిస్తాయి. దీర్ఘకాలిక పరిష్కారాలు లభిస్తాయని మేం ఆశిస్తున్నాం' అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్

# సత్తా చాటాలి

## ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి పిలుపు

**నిజామాబాద్,తెలంగాణ దిశ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి పిలుపు నిచ్చారు. అలాగే 29న నిర్వహించే దీక్షా దివస్' ను విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం అధికార పార్టీ తంటాలు పడుతోందని, బీసీ రిజర్వేషన్లు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.
42 శాతం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ చివరికి పంచాయతీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా లేకుండా చేసిందని ధ్వజమెత్తారు. ఇది ముమ్మాటికీ బీసీలకు ద్రోహం చేయడమేనని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలను అమలుచేయలేక, ఎన్నికలకు వెళ్లే ధైర్యంలేక న్యాయస్థానం చెప్పేవరకు చేసుకుందని విమర్శించారు. అందుకే పార్టీ గుర్తులు లేని పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తోందని, ఎవరు గెలిచినా తమవాళ్లే అని చెప్పుకోవడం కోసం ఈ తతంగం చేస్తోందని ధ్వజమెత్తారు.



## పంచాయతీ ఎన్నికల తొలివిడత

# నామినేషన్ల పర్వం షురూ

-మంథని మండలంలో 36 సర్పంచ్, 13 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ల దాఖలు
-ఎగ్లాస్ పూర్ నామినేషన్ సెంటర్ ను పరిశీలించిన ఎలక్షన్ అబ్జర్వర్లు


**మంథని ,త్రెలంగాణ దిశ :తెలంగాణ లో పంచాయితీ ఎన్నికల సందడి మొదలైంది. తొలి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం గురువా రం నుంచి ప్రారంభమైంది.ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.ఈ క్రమంలోనే మంథని డివిజన్లో పంచాయితీ ఎన్నికల తొలి దశకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ గురువారం ప్రారంభ మైంది. ఇందుకు ముందుగా కలెక్టర్లు ఎన్నికల నోటిఫికేష న్లు జారీ చేశారు. ఆ వెంటనే సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ల స్వీకరణ మొదలైంది. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల దాకా నామినే షన్లు స్వీకరించారు.మంథని మండలంలో 35 సర్పంచ్, 282 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మంథని మండలంలో 35 గ్రామపంచా యతీలను 10 క్లస్టర్లుగా విభజించారు. దుబ్బపల్లి గ్రామపంచాయతీలో సిరిపురం, దుబ్బపల్లి,బేస్తపల్లి గ్రామాలకు చెందిన వారు, గ్రామపంచాయతీలో గుంజపడుగు, చిల్లపల్లి గ్రామాల వారు,కన్నాల గ్రామపంచాయతీలో కన్నాల, నాగారం, అక్కెపెల్లి, మల్లేపెల్లి గ్రామాల వారు,. పుట్టపాక జిపి లో నగరంపల్లి పుట్టపాక,లక్కేపూర్,తోటగోపయ్యపల్లి గ్రామాల వారు, మైదుపల్లి జిపి లో మైదుపల్లి, గాజులపల్లి,గుమ్నూర్,..**



## 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు

# హైకోర్టులో ఊరట

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో 2015 గ్రూప్-2 ర్యాంకర్ల కు హైకోర్టులో ఊరట లభించింది. గ్రూప్-2పై సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ బెంచ్ తీర్పును టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేయగా.. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. 2015-16 గ్రూప్-2ను రద్దు చేస్తూ ఇటీవల హైకోర్టు సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే.



## 12 రాష్ట్రాల్లో కొనసాగుతున్న

# ఎస్ ఐ ఆర్

న్యూఢిల్లీ, : దేశంలోని 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) జరగుతోంది. ఓటరు జాబితాను శుద్ధి చేస్తున్నారు. ఇందులో నకిలీ ఓట్లు, రెండు మూడు ఓట్లు ఉన్నవారిని తొలగిస్తున్నారు. సరైన పత్రాలు లేనివారిని, నకిలీ పత్రాలతో ఓటుహక్కు పొందినవారిని తొలగిస్తున్నారు. ఇందులో ఉత్తరప్రదేశ్ కూడా ఒకటి. నేపాల్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు అక్రమంగా వచ్చి గోరఖ్‌పూర్ నుంచి గౌతమ బుద్ధనగర్ వరకు లఖీన్‌పూరిఖేరీ, బెహ్రాయిచ్, ఫిల్‌బిత్ జిల్లాల్లో నేపాలీలు ఎక్కువ. సరిహద్దు జిల్లాల్లో మదరసాలు ఉన్నాయి. ముస్లింలు కూడా అక్రమంగా ఉంటున్నారు. పశ్చిమబెంగాల్ నుంచి పారిపోయిన బంగ్లాదేశీయులు ఉత్తరప్రదేశ్‌కు వస్తున్నారు. దీంతో యోగి ఆదిత్యనాథ్ అప్రమత్తమయ్యారు.పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి అక్రమంగా వలస వచ్చిన వారిని గుర్తించి డిటెన్షన్ సెంటర్లలో పెట్టాలని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు. ఈ డిటెన్షన్ సెంటర్లు అసోంలో ఉన్నాయి. ఇప్పుడు యూపీలో కూడా ఏర్పాటు చేశారు. డిటెన్షన్ సెంటర్లలో అక్రమంగా వచ్చినవారిని ఉంచి.. వారి ఇంతకాలం ఎలా ఉన్నారు. ఏం చేశారు.

## రంగంలోకి

# దళపతి



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**స్థానిక సమరం తెలంగాణ పొలిటికల్ పిచ్‌ను హీటెక్కిస్తోంది. గ్రామాల్లో పార్టీకి పునాదిగా ఉండే లోకల్ బాడీ పోల్స్‌పై రాజకీయ పార్టీలన్నీ సీరియస్ కాన్సన్‌ట్రేషన్ చేశాయి. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ ఎన్నికలను సీరియస్‌గా తీసుకుంటుంది. బీసీ రిజర్వేషన్లపై అధికార కాంగ్రెస్‌ను ఎండగడుతూనే సర్పించ్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను గెలుచుకోవాలన్న లక్ష్యంతో ముందుకెళ్తోంది.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్..మాట తప్పి పార్టీపరంగా రిజర్వేషన్లు అంటూ బీసీలకు అన్యాయం చేస్తోందని ప్రజల్లోకి తీసుకెళ్లాలని డిసైడ్ అయ్యింది.

# ఘనంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు

## అభివృద్ధి ప్రధాతకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల్ ప్రజానీకం







**మల్లాపూర్, నవంబర్ 27, (తెలంగాణ దిశ) :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. మల్లాపూర్ వివిఎన్ఆర్ గార్డెన్ లో జరిగిన వేడుకలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ నాయకులు, నియోజకవర్గం ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేకులు కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు తదితరులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా ఆయన మొక్కను నా టారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ అనే చాలా మంచి కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. ఈ మొక్కలు నాటడం అంటే మాకు చాలా సంతోషం కలుగుతుందని అన్నారు. ఒకప్పుడు హైదరాబాదులో ఎక్కడ చెట్లు కనిపించేది కాదని, కానీ ప్రస్తుతం ఎక్కడ చూసినా కూడా పచ్చని చెట్లు కనిపిస్తున్నాయని అన్నారు. ఇదంతా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన హరిత హారం స్ఫూర్తితో ప్రస్తుతం నగరమంతా పచ్చగా మారిపోయిందని అన్నారు. మనందరం మంచి ఆరోగ్యంతో ఉండాలంటే మంచి వాతావరణం అవసరమని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ప్రతినిధి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# బాచుపల్లిలో గోదావరి కట్స్ అవుట్ లెట్ ప్రారంభం

### - కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం





**కుత్బుల్లాపూర్, నవంబర్ 27, (తెలంగాణ దిశ)** :బాచుపల్లిలో గోదావరి కట్స్ కొత్త అవుట్ లెట్‌ను గురువారం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి వేగవంతమైన జీవనశైలిలో ప్రజలు విశ్వసించగలిగే నాణ్యమైన మాంసం, చేపలు అందుబాటులో ఉండటం అత్యంత అవసరమని అన్నారు. ఈ నేపథ్యంలో గోదావరి కట్స్ తమ ప్రత్యేకమైన శుభ్రమైన ప్రాసెసింగ్ విధానం, హైజీనిక్ స్టాండర్డ్స్, తాజా ఉత్పత్తుల కారణంగా ప్రజల విశ్వాసాన్ని పొందిన ప్రముఖ బ్రాండ్‌గా నిలిచిందన్నారు. శుభ్రత, నాణ్యత, సరసమైన ధరలు... ఈ మూడు లక్షణాలతో గోదావరి కట్స్ ప్రజల్లో విశేషమైన ఆదరణను సంపాదించిందన్నారు. అనేక కుటుంబాలు నమ్మకంగా కొనుగోలు చేయగలిగే చోటుగా గోదావరి కట్స్ నిలుస్తోందన్నారు. బాచుపల్లి ప్రాంత ప్రజలకు ఈ కొత్త బ్రాంచ్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఎస్ఎల్ గ్రూప్ అధినేత గుర్రాల నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూగోదావరి కట్స్‌లో అందించే మాంసం, చేపలు అత్యున్నత ప్రమాణాలతో ప్రాసెస్ చేయబడతాయన్నారు. చికెన్, మటన్, ఫిష్, సీఫుడ్ తదితర విభిన్న ఉత్పత్తులను రోజువారీగా తాజాగా అందిస్తున్నామన్నారు. కొత్త బ్రాంచ్ ప్రారంభంతో బాచుపల్లితో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన నాన్‌వెజ్ ఉత్పత్తులను అందజేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దుండిగల్ డబల్ బెడ్ రూమ్ ఇల్లు నీటి సమస్య తీరుస్తా





**కుత్బుల్లాపూర్, నవంబర్ 27, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్ డబల్ బెడ్ రూమ్ ఇళ్ల నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. గురువారం దుండిగల్ డబల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీవాసులు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎర్రగుండదు పత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వార్తలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు కావలి గణేష్, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముత్యం రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఉన్ని కృష్ణ పార్కు ప్రారంభం





**కుత్బుల్లాపూర్, నవంబర్ 27, (తెలంగాణ దిశ)** :నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్ 22 వ డివిజన్ లో ఉన్ని కృష్ణ పార్కును కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. పార్క్ పూర్తిగా పాడై నిరూపయోగంగా ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నామని, పార్కును మరమత్తు చేయించాలని హన్మంత్ రెడ్డిని కోరారు. ఇందుకు స్పందించిన ఆయన నిజాంపేట్ కమిషనర్ తో మాట్లాడి పార్కు మరమ్మత్తు కోసం అవసరమైన నిధులను కార్పొరేషన్ ద్వారా మంజూరు చేయించి పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నిజాంపేట్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, మహిళ కాంగ్రెస్ నిజాంపేట్ అధ్యక్షురాలు కడియాల ఇందిరా, ఆలేటి శ్రీనివాస్, 22 వ డివిజన్ అధ్యక్షులు వరుగని వాసు, 23వ డివిజన్ అధ్యక్షులు రమేష్, వేడ శ్రీనివాసరావు, వీరయ్య, మధు,సత్య,రాము, మల్లేష్, భవాని ప్రసాద్, రమేష్ (స్టీల్ )ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కు అభినందనల వెల్లువ

### - ఘనంగా సన్మానించిన ఏఎస్ రావు నగర్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు





**ఏఎస్ రావునగర్, నవంబర్ 27, (తెలంగాణ దిశ)** :కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన తోటకూర వజ్రేష్ యాదవ్ ను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు గురువారం బోడుప్పల్ లోని వజ్రేష్ యాదవ్ నివాసానికి చేరుకొని పూలమాలలు వేసి, పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ సీనియర్ నాయకులు పాకాల రాజు, ముదిగొండ లింగస్వామి, ఆదినారాయణ, భద్రగామ నరసింహ సిహెచ్ బాల నరసింహ సాహెబ్, యాదగిరి రెడ్డి, శ్రీనాథ్, సలీం, జివిఎస్ఎన్ రావు, అల్లా బక్షి, ఎస్ఎం. ఫీరా, హుస్సేన్ వల్లి, ఎస్ఎం. ఇబ్రహీం, రహమతుల్లా, వివి. సత్యనారాయణ, ఎస్ఎం. సుభాన్, సుందర్, వేణుగోపాల్, మహిళా నాయకురాళ్లు భవాని, సంధ్య, మాధవి, రాధా, పద్మ విజయలక్ష్మి, కె. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భూపతి వెంకటేష్ గుప్తా జన్మదిన వేడుకలు



ప్రముఖ వ్యాపారవేత్త జమ్మిగడ్డకు చెందిన భూపతి వెంకటేష్ గుప్తా జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కాలనీవాసులు ఆయనను ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. నిండు నూరేళ్ళు సంపూర్ణ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనసారా ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు, బిఆర్ఎస్ నాయకులు ఎస్ఏ. రహీమ్, కాంగ్రెస్ పార్టీ నేత తాళ్ళపల్లి సందీప్ గౌడ్, ప్రముఖ సామాజికవేత్త జైయిని రాజేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

(ఏఎస్ రావునగర్, తెలంగాణ దిశ)

# దశలవారీగా అన్ని కాలనీలలో మౌలిక వసతులు కల్పిస్తాం



### - కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, నవంబర్ 27, (తెలంగాణ దిశ)** :దశలవారీగా నియోజకవర్గ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక వసతులు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్ 23 వ డివిజన్ లో సీసీ రోడ్డును ప్రారంభించారు. ఇక్కడ రోడ్డు పూర్తిగా పాడవడంతో స్థానికులు నూతన రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయించాలని హన్మంత్ రెడ్డిని కోరారు. దీంతో స్పందించిన ఆయన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయించారు. రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో దానిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నిజాంపేట్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, నిజాంపేట్ మహిళ అధ్యక్షురాలు కడియాల ఇందిరా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండలపు రమేష్, గోలి శ్రీనివాస్, గోలి విజయలక్ష్మి, నవ్య, రాణి, అనుపమ, జ్యోతి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో శ్రీరామ్ ఫుడ్స్ అవుట్ లెట్ ప్రారంభం



**చర్లపల్లి, నవంబర్ 27, (తెలంగాణ దిశ) :** చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో జైలుకు సమీపంలో గురువారం శ్రీరామ్ ఫుడ్స్ అవుట్ లెట్ ను శ్రీరామ్ బేకర్స్ అండ్ స్వీట్స్ అధినేత కట్కూరి విజయ్ కుమార్ రెడ్డి శ్రీరామ్ ఫుడ్స్ అధినేత కట్కూరి సుధాతో కలిసి ప్రారంభించారు. పరిశ్రమగా ప్రాంతంలో ఇటీవల ఏర్పాటు చేసిన సెంట్రల్ కిచెన్ (శ్రీరామ్ ఫుడ్స్) ప్రాంగణంలో అవుట్ లెట్ ను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.
సెంట్రల్ కిచెన్ లో అప్పటికప్పుడు తయారుచేసిన బేకరీ నాణ్యమైన తిను బండారాలను వినియోగదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. వినియోగదారుల సహకారంతో ఇప్పటికే చక్రిపురం చౌరస్తాలో శ్రీరామ్ బేకర్స్ అండ్ స్వీట్స్ సంస్థను కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు. నూతనంగా ప్రారంభించిన శ్రీరామ్ ఫుడ్స్ అవుట్ లెట్ ను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఆయన కోరారు.




# సంపాదకీయం

## సెక్స్ వార్ ఫేర్...

టెక్నాలజీ పెరిగేకొద్దీ.. శత్రువుని దెబ్బతీసేందుకు.. వారి రహస్యాలను దొంగిలించే పద్ధతి మారుతుంది. అలా.. ఇప్పుడు కొత్తగా ట్రెండింగ్‌లోకి వచ్చిందే.. సెక్స్ వార్ ఫేర్. ఎస్.. సిలికాన్ వ్యాలీలో నడుస్తున్న సరికొత్త గూఢచర్యం ఇది. వలపు వల విసిరి.. దిగ్గజ టెక్ కంపెనీల ట్రేడ్ సీక్రెట్లని దొంగిలించేస్తున్నారు. దిగ్గజ టెక్ కంపెనీలన్నీ ఉండే.. సిలికాన్ వ్యాలీలో.. అకస్మాత్తుగా సెక్స్ వార్‌ఫేర్ పెరిగిపోయింది. చైనా, రష్యాకు చెందిన ఆపరేటర్లు.. టెక్ కంపెనీల్లోకి చొరబడేందుకు, అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను ప్రలోభ పెట్టేందుకు, అక్కడి ట్రేడ్ సీక్రెట్స్‌ని.. దొంగిలించేందుకు అందమైన, ఆకర్షణీయమైన మహిళలను వాడుతున్నట్లు తేలింది. ఇదే.. ఇప్పుడు అందరినీ షాక్‌కి గురిచేస్తోంది. అంతేకాదు.. ఓ గూఢచారి మహిళ.. ఓ టెకీని పెళ్లి కూడా చేసుకుంది. ఆమెను.. అతను ఓ మీటింగ్‌లో కలిశాడు. ఆమె అందమైనదే కాదు.. ఎంతో తెలివైంది కూడా. అతనంటే నిజంగానే ఎంతో ప్రేమ ఉన్నట్లు, ఇష్టం ఉన్నట్లు నమ్మించింది. కొన్నేళ్ల తర్వాత.. ఆమె ఓ ఇంటలిజెన్స్ ఆపరేషన్‌లో భాగమని, అమెరికా వాడే టెక్నాలజీ నుంచి అనేక రహస్యాలను తెలుసుకునేందుకు వచ్చిందని.. తెలుసుకున్నాడు. ఇదే.. ఇప్పుడు సిలికాన్ వ్యాలీలో నడుస్తున్న లేటెస్ట్ స్పై ఆపరేషన్. ఎరగా అందమైన, ఆకర్షణీయమైన మహిళలు. చైనా, రష్యాకు చెందిన కొందరు ఆపరేటర్లు.. అమెరికా టెక్ కంపెనీల్లోకి చొరబడి, అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను ప్రలోభపెట్టేందుకు అందమైన మహిళల్ని ఎరగా వాడుతున్నట్లు తేలింది. కొన్ని సందర్భాల్లో.. ఆ గూఢచారి మహిళలు.. తమ టార్గెట్లను పెళ్లి కూడా చేసుకుంటారు. టెక్నాలజీపరమైన రహస్యాలను దొంగిలించే క్రమంలో.. ఎక్కువ కాలం వారితో ఉండాల్సి వచ్చినప్పుడు.. పిల్లలను కూడా కంటారు. అందుకోసమే.. ఇంటలిజెన్స్ ఎక్స్‌పర్ట్స్ దీనిని సెక్స్ వార్‌ఫేర్ అని పిలుస్తున్నారు. ఇదంతా.. టెక్ ప్రపంచంలో పెరుగుతున్న అమెరికా ఆధిపత్యానికి ముప్పును సూచిస్తోందని చెబుతున్నారు. చైనాలో పెట్టుబడులు పెట్టే.. అమెరికా కంపెనీలకు సలహాలు ఇచ్చే నిపుణులు.. దీనిని గమనించారు. లింక్డ్ ఇన్ లాంటి ప్లాట్ ఫామ్స్‌లో.. అందమైన యువతుల నుంచి తమకు రిక్వెస్ట్‌లు వస్తున్నాయంటున్నారు. ఈ మధ్యకాలంలో సిలికాన్ వ్యాలీలో ఈ తరహా గూఢచర్యం బాగా పెరిగిందని కౌంటర్ ఇంటలిజెన్స్ నిపుణులు చెబుతున్నారు. ఇటీవల.. చైనా పెట్టుబడి నష్టాలపై వర్జీనియాలో జరిగిన వ్యాపార సమావేశంలోనూ.. ఇద్దరు ఆకర్షణీయమైన చైనీస్ లేడీస్ ప్రవేశించడానికి ప్రయత్నించినట్లు గుర్తించారు. ఇది.. కచ్చితంగా అమెరికా ఇంటలిజెన్స్ వైఫల్యమే అంటున్నారు. టెక్ కంపెనీల సీక్రెట్స్ దొంగిలిస్తున్న గూఢచారులు. అయితే.. సెక్స్ బేస్డ్ గూఢచర్యం ఇప్పుడున్న ముప్పులో ఓ పార్ట్ మాత్రమే. యూఎస్ బిజినెస్ ప్లాన్స్‌ని సేకరించేందుకు.. చైనా అమెరికా గడ్డపై స్టార్టప్ కాంపిటీషన్స్ నిర్వహిస్తోంది. ఈ ఆపరేషన్‌కి.. రష్యా, చైనా.. తమ దేశ పౌరులు, పెట్టుబడిదారులు, విద్యావేత్తలు, క్రిప్టో అనలిస్టులను.. అనధికార నిఘా ఏజెంట్లుగా వాడుతుండటం వల్ల.. ఈ కార్యకలాపాలను గుర్తించడం కష్టతరమవుతోందని నిపుణులు అంటున్నారు. మరోవైపు.. అందమైన తమ దేశపు మహిళలకు.. ఓ టార్గెట్‌ని సెలక్ట్ చేయడం, వారిని పెళ్లి చేసుకోవడం.. ఓ లక్ష్యంతో పిల్లల్ని కనడం, జీవితాంతం.. టెక్ సీక్రెట్స్ సేకరించే ఆపరేషన్ నిర్వహించడం లాంటివి చేస్తున్నారు. ఈ రకంగా చేయడం వల్ల.. అస్సలు అనుమానమే వచ్చే పరిస్థితి లేదంటున్నారు. ఈ విధంగా.. మేధో సంపత్తిని దొంగిలించేందుకు.. ఏడాదికి 600 బిలియన్ డాలర్ల దాకా ఖర్చవుతోంది. ఇదంతా.. ఎక్కువగా చైనా నుంచే జరుగుతోంది. స్టార్టప్‌లు.. చైనా ఇన్వెస్టర్లతో తమ బిజినెస్ ప్లాన్స్‌ని పంచుకుంటే.. రహస్యాలను కోల్పోయే ప్రమాదం ఉంది. లేనిపక్షంలో.. వాళ్లు చైనాకే వెళ్లాల్సి వచ్చే ప్రమాదం కూడా ఉంది. భవిష్యత్తుల్లో అమెరికా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదా? సిలికాన్ వ్యాలీ.. ఇప్పుడు సాఫ్ట్ ఎకనమిక్ గూఢచర్యానికి కేంద్రంగా మారింది. టెక్నాలజీతో పాటు ట్రేడ్ సీక్రెట్స్‌ని కూడా టార్గెట్‌గా చేసుకుంది. చైనా దీనిని.. డ్రాఫ్ట్‌గా పిలుస్తోంది. యూఎస్ యాక్సెస్‌ని నిరోధించేందుకు.. డీవోడీ నిధులతో కూడిన స్టార్టప్‌లలో వాటాలు కొనుగోలు చేస్తోంది. సిలికాన్ వ్యాలీ ఓపెన్ కల్చర్ కూడా గూఢచారులు ఎంట్రీ ఇచ్చేందుకు.. రూట్ క్లియర్ చేస్తోంది. సౌత్ కొరియా, ఇజ్రాయెల్ లాంటి అమెరికా మిత్రదేశాలు కూడా.. సైలెంట్‌గా తమకు కావాల్సిన సమాచారాన్ని సేకరిస్తుంటాయని.. ఇంటలిజెన్స్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. 2017లో రష్యన్ కాన్సులేట్ మూసివేసిన తర్వాత కూడా.. రష్యా హనీపాట్స్, మధ్యవర్తులను ఉపయోగిస్తోంది. ఇక.. చైనా అయితే.. టెక్నాలజీ, ఐపీ అడ్రస్‌ల కోసం.. ఓ భారీ వలనే విసురుతోంది. ఈ విషయంలో.. యూఎస్ కౌంటర్ ఇంటలిజెన్స్ అనేక అడ్డంకులను ఎదుర్కొంటోంది. ఎందుకంటే.. స్టార్టప్స్ తరచుగా బెదిరింపులను తక్కువగా రిపోర్ట్ చేస్తాయ్. మరోవైపు.. సిలికాన్ వ్యాలీలోని ఓపెన్ కల్చర్.. స్పై ఆపరేషన్లను సులభతరం చేస్తోంది. అందువల్లే.. చైనా, రష్యా.. హనీ ట్రాప్ పద్ధతుల్లో.. దిగ్గజ టెక్ కంపెనీల నుంచి ట్రేడ్ సీక్రెట్స్ దొంగిలిస్తున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయ్. బడా టెక్ కంపెనీల్లో.. విలువైన సమాచారాన్ని యాక్సెస్ చేయగలిగే వారిని.. ప్రేమలోకి దించడం గానీ, వలపు వల విసరడం గానీ చేసి.. తమకు కావాల్సిన సమాచారాన్ని రాబట్టుకుంటున్నారు. తమ సంబంధాలతో.. మేధో సంపత్తి, మిలటరీ టెక్నాలజీతో పాటు ఇతర రహస్య సమాచారాన్ని దొంగిలించడమే లక్ష్యంగా.. గూఢచర్యం చేస్తున్నారు. చైనా, రష్యా సిలికాన్ వ్యాలీనే సెలక్ట్ చేసుకోవడానికి ఓ రీజన్ ఉంది. ఇక్కడ.. సెమీ కండక్టర్ల నుంచి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ దాకా.. కీలకమైన టెక్నాలజీలన్నింటిని.. సిలికాన్ వ్యాలీ సెంటర్‌గా ఉంది. ఇలా.. మేధో సంపత్తి దొంగతనం ద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థకు.. ఏడాదికి కొన్ని వందల బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతోందని చెబుతున్నారు. చైనాకు చెందిన వారి వీసాలను రద్దు చేస్తున్న అమెరికా. హనీ ట్రాప్, సెక్స్ వార్‌ఫేర్ లాంటి గూఢచర్య పద్ధతులు.. టెక్ కంపెనీల్లో ఇంటర్నల్ టెన్షన్స్‌ని పెంచుతాయ్. సంస్థలకు తీవ్రమైన ఆర్థిక, జాతీయ భద్రతా నష్టాలను కలిగిస్తాయ్. ఇలాంటి ఎన్నో రిపోర్ట్స్, న్యూస్.. పబ్లిక్ డొమైన్‌లో ఉన్నప్పటికీ.. జనంలో చర్చ జరిగినప్పటికీ.. గూఢచర్యాన్ని ఆపడం కష్టమవుతుంది. ఎందుకంటే.. స్పై ఆపరేషన్లన్నీ.. చాలా సీక్రెట్‌గా జరుగుతుంటాయ్. దొంగిలించబడిన మేధోసంపత్తితో.. విదేశీ ప్రత్యర్థులు.. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఖర్చు లేకుండా.. దాదాపు ఒకే తరహా ఉత్పత్తులను తక్కువ ధరకు విక్రయిస్తారు. దీనివల్ల.. అమెరికన్ కంపెనీల మార్కెట్ వాటా తగ్గిపో తుంది. మిలటరీకి సంబంధించిన సున్నితమైన టెక్నాలజీ దొంగిలించడం వల్ల.. జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లుతుంది. ఎఫ్ బీఐ తో పాటు ఇతర గూఢచార సంస్థలు.. సిలికాన్ వ్యాలీతో పాటు తమ డిఫెన్స్ పరిశ్రమలపైనా నిఘా పెంచాయి. ముఖ్యంగా.. ఈ తరహా సరికొత్త వార్‌ఫేర్‌ని నిరోధించేందుకు చురుగ్గాపనిచేస్తున్నాయ్. ఇప్పటికే..చైనాకు చెందిన విద్యార్థులు, పరిశోధకులు గూఢచార కార్యకలాపాలు చేస్తున్నారని అనుమానం వచ్చిన వారి వీసాలను అమెరికా రద్దు చేసింది. విదేశీ గూఢచారుల నుంచి అమెరికన్ ఆస్తులను కాపాడుకునేందుకు ప్రయత్నాలు. మరోవైపు.. దిగ్గజ టెక్ కంపెనీలన్నీ.. ఉద్యోగులతో పాటు కొత్తగా జాబ్స్ కోసం అప్లై చేసిన వారికి సంబంధించి.. తనిఖీలను కఠినతరం చేశాయ్. చైనా లింకులున్న వారి పట్ల మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయ్. ముఖ్యంగా.. సైబర్ చొరబాట్లను అరికట్టేందుకు.. కంప్యూటర్ భద్రతా వ్యవస్థలను పటిష్టం చేస్తున్నాయ్.

# ఏఐ.. వరమా..? శాపమా..?




ప్రస్తుతం ప్రపంచాన్ని శాసించే దిశగా పయనిస్తున్న అత్యాధునిక సాంకేతికత కృత్రిమ మేధ (ఏఐ) యుగంలో జీవిస్తున్నాం. ఈ మధ్యకాలంలో విడుదలవుతున్న దాదాపు ప్రతి సాధనం (సాఫ్ట్‌వేర్) ఏఐ వెర్షన్‌ను అందిస్తూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఒక సర్వే ప్రకారం, ప్రతి ఇద్దరు భారతీయుల్లో ఒకరు ఏదో ఒక రూపంలో ఏఐ సాంకేతికతను ఉపయోగిస్తున్నారట! ఒక్క ఏఐ అనే కాదు ఏ సాంకేతికత అయినాసరే దాన్ని'మానవాళికి వరం' అంటూ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు! అయితే, ప్రతివ్యక్తికీ మోసగించే ప్రవృత్తి కూడా ఒకటి ఉంటుందని మరోపక్క శాస్త్రాలు హెచ్చరిస్తున్నాయి! ఇలాంటి పరిస్థితుల్లో, మనం ఏఐని సంపూర్ణంగా విశ్వసించగలమా?భగవద్గీత ప్రకారం, ప్రతీ ఆవిష్కరణ భగవంతుడు ప్రేరేపించిన బుద్ధితో ప్రకృతిలో సూక్ష్మ నియమాలను కనుగొనడం ద్వారా లభిస్తుంది. ప్రతి సాంకేతిక ఆవిష్కరణ ఒక కత్తితో పోల్చదగినది. ఒక వైద్యుడు కత్తిని ఉపయోగించి ఆపరేషన్ చేసి వ్యక్తి ప్రాణాలను కాపాడగలడు. ఒక దుర్మార్గుడు అదే కత్తిని మరోవ్యక్తి ప్రాణాలను తీసేందుకూ ఉపయోగించగలడు. కాబట్టి, ఇక్కడ ప్రశ్న కత్తి మంచిదా, చెడ్డదా అని కాదు. దాన్ని ఎలా ఉపయోగిస్తారన్నదే అసలు విషయం. అదే విధంగా, ఏఐ సాంకేతికత స్వతహాగా మంచిదికానీ చెడ్డదికానీ కాదు. దాన్ని ఎలా ఉపయోగిస్తారన్నదే ముఖ్యం. ప్రపంచంపై ఆధిపత్యం చెలాయించేందుకా, లేదా ధనికులుగా మారేందుకా! భగవత్ సంబంధితమైన సాంస్కృతిక విలువలను ప్రోత్సహించి సమాజంలో మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సును పెంపొందించేందుకా?కృత్రిమ మేధస్సు (ఏఐ), అణుశక్తి, ఇతర శక్తిమంతమైన సాంకేతికత ఏదైనా సరే, దానిని కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే కలిగే దుష్పరిణామాలను గురించి హరేకృష్ణ ఉద్యమ సంస్థాపక ఆచార్యులైన శ్రీల ప్రభుపాదుల వారు తమ భగవద్గీత భాష్యంలో స్పష్టంగా హెచ్చరించారు. భౌతిక ప్రపంచంలో సాధ్యమైనంత వరకు సుఖం అనుభవించాలని ప్రయత్నిస్తూ, ఇంద్రియ సుఖాల కోసం ఏదో ఒక కొత్త దాన్ని కనిపెట్టడంలోనే వాళ్లు ఎల్లప్పుడూ నిమగ్నులై ఉంటారు. అలాంటి భౌతిక పరిశోధన ఫలితాలు మానవ నాగరికత పురోభివృద్ధిగా పరిగణించినప్పటికీ, ప్రజలు రోజురోజుకూ హింసాప్రాయులుగా, క్రూరులుగా తయారవుతున్నారు. జంతువుల పట్ల, సాటి మనుషుల పట్ల హింసా ప్రవృత్తిని పెంచుకుంటున్నారు. తోటి జీవులతో ఎలా మెలగాలో వారికి తెలియడం లేదు. తమ పరిశోధనల ద్వారా అందరికీ వినాశనాన్ని చేకూర్చే వస్తువులను కనిపెట్టే వాళ్లు ప్రపంచానికి శత్రువులుగా పరిగణన పొందుతారు.మనిషి పుటింది మొదలు గిట్టే వరకు సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తూనే ఉంటుంది. మనిషి తన మేధస్సుకు, మనుగడకు ఎదురయ్యే ప్రతి సమస్యలను, సవాళ్ళను అధిగమించి ఎప్పటికప్పుడు వాటిని అవకాశాలుగా మార్చుకుంటూనే వస్తున్నాడు. తాజాగా కృత్రిమ మేధస్సు (ఏఐ) మానవునికి సవాల్‌గా మారుతుందా అన్నది ఆలోచించాల్సిన అంశం.తన శారీరక శ్రమను తగ్గించుకోవడానికి అనేక రంగాల్లో పరిశోధనలు చేసి వాటికి పరిష్కార మార్గాలు కనుగొన్నాడు. ఇప్పుడు ప్రపంచాన్ని ఊపేస్తున్న ఏఐ కూడా మానవ సృష్టే అన్న విషయం మరువొద్దు. తన సౌలభ్యం కోసం సృష్టించిన ఏఐ ఇవాళ సొంతంగా ఆలోచిస్తూ నిర్ణయాలు తీసుకోవడమే కాదు అత్యంత వేగంగా, దోషరహితంగా పనిచేస్తుంది. మరి ఏఐ వరమా? శాపమా అన్న విషయాన్ని గమనిస్తే.. ఏఐ వచ్చి న తర్వాత సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగుల లేఆఫ్స్ పెరిగిపోతున్న వార్తలు తరచూ చూస్తూనే ఉన్నాం. నిజానికి ఏఐ రావడం వల్లనే ఉద్యోగాలు ఉడిపోతున్నాయనేది కేవలం అపోహ మా త్రమే.ఎందుకంటే ఏఐను సృష్టించింది మానవుడే. దానిని నియంత్రించే శక్తి కానీ, మెరుగుపరిచే సాంకేతికత కానీ మానవుడికే ఉంటుంది తప్ప ఏఐ తనంతట తానుగా అప్‌గ్రేడ్ చేసుకోలేదు. ఏఐ అప్‌గ్రేడ్ కోసం మళ్లీ మానవుడి తెలివితేటలే అవసరం అన్న విషయాన్ని గ్రహించండి. ఏఐ ఎప్పుడూ మనిషికి సేవకుడే కానీ పోటీదారుడు ఎంతమాత్రం కాదు. ఏఐను దాటడానికి పరిష్కార మార్గాలు కూడా మన చేతుల్లోనే ఉన్నాయి.నైపుణ్యాలు పెంచుకోవడం, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ కోర్సులతో ఏఐపై పట్టు పెంచుకోవడం చేయాలి. ఏఐ మనిషిలా ఆలోచిస్తుంది, కానీ మనిషిని మంచి సృజనాత్మకతను చేయలేదు. కళ, సాహిత్యం, సంగీతం, డిజైన్ రంగాలు ఎప్పటికీ సురక్షితమే. మానవుని భా వాలు, ఊహలు ఏఐకి ఎప్పటికీ రావు. మారుతున్న సాంకేతిక యుగంలో ఏఐ తదనంతరం కూడా కొత్త టెక్నాలజీ పుట్టుకొస్తూనే ఉంటుంది. వాటిని సృష్టించేది కూడా మానవుడే అనేది సత్యం. ఏఐ నిర్వహణ, ఏఐ ఎథిక్స్, ఏఐ భద్రత, గ్రీన్ టెక్నాలజీ, సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ రంగాలు భవిష్యత్తులో మరింత విస్తరించనున్నాయి.నిరుద్యోగాన్ని తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలి. ప్రతీ మార్పు కొత్త అవకాశం కోసమే అన్నది గుర్తుంచుకోవాలి.

కొన్ని దశాబ్దాల కిందట అనేక నూతన యంత్రాలు, కంప్యూటర్ పరికరాలు వచ్చినప్పుడు కూడా కార్మికులు, ఉద్యోగులు ఇదే విధంగా భయపడ్డారు. కానీ ఎన్ని యంత్రాలు, పరికరాలు తయారైనా వాటిని ఆపరేట్ చేయాల్సింది మనుషులే. ఎందుకంటే వాటంతట అవి ఆపరేట్ చేసుకోగలిగే శక్తి ఉన్నా ఎంత మోతాదులో కావాలన్నది నిర్ణయించాల్సింది మనమే అన్న విషయం తెలుసుకోవాలి. మానవుని కోరికలు, అభిరుచులు అనంతం.వాటిని తీర్చుకోవడానికి మానవుడు ఎప్పటికప్పుడూ తన సృజనాత్మకతకు పదును పెడుతూనే ఉన్నాడు. ఇప్పు డు వచ్చిన ఏఐ విషయంలోనూ అదే జరుగుతుంది. ఏఐ పట్ల భయం, నిరుత్సాహం, నిస్తేజం అనవసరం. మానవుని ఆలోచనలు, అభిరుచులకు తగ్గట్లుగా మారే ఆలోచనా విధానం ఏఐలో లేవు. ఏఐ మానవ చరిత్రను మారుస్తుంది. కానీ మానవుడు దాని సృష్టికర్త అని మరువద్దు. ఏఐని ఉపయోగించి సమాజాన్ని మెరుగుపరచాలి. అలాగే ఏఐ యుగం ఎప్పటికీ మానవుని విజయమే.

# వర్తమాన అకృత్యాలపై రాజేసిన కొలిమి



ఇటీవల గొప్ప సామాజిక కవిత్వం రాస్తున్న వారిలో పతివాడ నాస్తిక్ ఒకరు. ఆయన వెలువరించిన కవితా సంపుటి 'కొలిమి రాజేయ్యాల్సిం దే' వర్తమాన సమాజానికి అవసరమైన స్వరం. ఈ మండే తన మనసు కొలిమినుంచి అక్షరాలను ఏరుకుంటాడు. వాటిని బాణాల్లా మార్చి సంధించటానికి విల్లును ఎక్కుపెట్టినప్పుడు ఇంక్విలాబ్ జిందా బాద్ నినాదాలు తప్ప, మరే మాటలు అతనికి వినిపించవు. చీకటి బజార్లో ముంచెత్తుతున్న దోపిడీ వాయుగుండాల వరద బీభత్సాన్ని మాత్రమే అతడు చూడగలుగుతాడు. తన చేతిలోని విల్లు తాడును లాగినప్పుడల్లా చెమట సంపద కొట్టుకుపోయి, దిక్కుతోచని దీనస్థితిలో వున్న బడుగు బతుక్కి భరోసా నిచ్చే ఒక శబ్దాన్ని కమ్యూనిజం వేదికగా ఈ కవి అందిస్తున్నాడు. కష్టజీవులంతా ఎర్ర సముద్రపు తరంగాల హోరులో కలిసి ఉద్యమించే రోజు వస్తుందని తన నమ్మకాన్ని ఒక జెండాలా అక్షరాల సాక్షిగా ఎగురవేస్తున్నాడు. కడుపులో లుంగచుట్టుకు పోతున్న పేగుల్ని తెంచుకొని పుట్టే పిడికిళ్లను గురించి చెబుతూ 'అవి మీ కంచాల మీద కలబడి/ మీ గోడౌన్ల మీదికి ఎగబడి/ మీ కొంపల్ని నేలమట్టం చేస్తాయి' అంటూ దోపిడీ వర్గాలకు పదునైన హెచ్చరికల్ని జారీచేస్తున్నాడు ఈ కవి.

నిబద్ధత కలిగిన కవుల వరుసల్లో సముచిత స్థానాన్ని అందుకున్న పతివాడ నాస్తిక్, వర్తమానంలో దిశా నిర్దేశాలు లేని కవులపట్ల తన నిరసనను తీవ్రమైన స్థాయిలోనే వ్యక్తం చేస్తున్నాడు. కష్టజీవుల కన్నీళ్ల తడిస్పర్శ అంటే ఏమిటో అర్థం కాకుండానే- పేదల ఆకలి మీద అలవోకగా కవిత్వాన్ని రాసే కవులందర్నీ ఒకచోట సమావేశపరిచి 'నువ్వు మురికివాడల్లోని/ ఇరుకు గుడిసెల్లోకి/ కష్టజీవుల్లోని/ చెమట చుక్కల్లోకి/ ప్రయాణించటం మొదలుపెట్టు/ అప్పుడు నువ్వు/ ఆకలిగొన్న చంటిబిడ్డకు/
అమ్మ కలిపిన పాలబువ్వలా/ కమ్మ కమ్మగా పరిమళిస్తావ్' అంటూ ఉద్బోధిస్తున్నాడు. ఈ మాటల్ని వర్తమాన కవులు చాలామంది జీర్ణించుకొని, వాటిని పాఠాలుగా స్వీకరించి ప్రజాకవులుగా మిగిలిపోవాలని ఆశిస్తున్నాడు.

వానలు, వరదలు ముంచెత్తి, కొంపా గూడూ నాశనమై పోయి, కన్నీళ్లతో ఓదార్చుకుంటూ, కలిసి కలో గంజో సర్దుకుని పంచుకుంటు న్న ఎర్రకలువల పక్కన నిలబడి, వాళ్ల హృదయ స్పందనను ఆసక్తిగా కవి వినిపిస్తున్నాడు. వాళ్ల కళ్లను వాళ్ల వేళ్లతోనే పొడిపించుకునేలా చేసిన నయావంచకులను ఎదురుగా నిలబెట్టి, గతంలో వాళ్లు చేసిన నిర్వాహకాలన్నింటినీ ఏకరువు పెడుతూ, కనురెప్పల మధ్య కోపాన్ని నిప్పుల్లా కురిపిస్తూ, పిడుగుల్లా మాటల్ని సంధిస్తూ 'చూడు../ నూటాయాభై కోట్ల బిందువులతో/ నిండిన ఈ సుందర సరోవరంలో/ ఎలుగెత్తే చైతన్యం వెల్లువలా లేస్తుంది/ ఎర్రని కలువలు పూసే/ మంచికాలం/ తప్పక నీ అంతు తేలుస్తుంది' అంటూ రేపటి కాలం మాత్రం మాదేనంటూ గర్జిస్తున్నాడు.

ఇది కష్టజీవుల చెమట వాసనతో పరిమళిస్తున్న కవిత్వం. రాజ్యం వెన్నులో వణుకు పుట్టించి, చట్టం కన్ను తెరిపించి, పేరుకున్న కుట్రల ముళ్ళ డొంకల్ని నరికివేసి, రేపటి ఉదయానికి ఈ రాత్రిని సిద్ధం చేయగల సూర్యబింబాలను పరిచయం చేస్తూ%ొ% 'వాళు గంజినీళ్లు కడుపు నిండా తాగి/ గుండె కమతాల్లో ఎర్రపూల వనాల్ని స్వప్నిస్తుం టారు / వాళ్లు రాగిజావ చేతినిండా జుర్రి/ మెదడు కొలుముల్లో చంద్ర నిప్పుకణాల్ని/ రాజేస్తూ వుంటారు/ దయచేసి మీ నగర జీవన మైకపు వలల్ని/ ఆ అమాయక జీవుల మీద విసిరి/ వాళ్ల బతుకుల్ని ఛిద్రం చేయకండి' అంటూ వురుములా వురిమిన ఈ మాటలు రేపటి పోరాటానికి ఇప్పుడే సంతకాలు చేస్తున్న గుండె సవ్వడిని వినిపిస్తున్నా యి. ప్రజల సమస్యల పట్ల, వారి బాధలు, కష్టాలు, కన్నీళ్ల పట్ల, వాళ్లు ఎదుర్కొంటున్న దోపిడీ మూలాల పట్ల ఈ కవికి సమగ్రమైన అవగాహన వుది. ఆయన కవిత్వంలో తొందరపాటు లేని అర్థవంతమైన ఆలోచనల వరుసలు మనతో కరచాలనం చేయటం విశేషం. తన కవిత్వం ద్వారా పూర్తి విశ్వా సాన్ని పొందగలిగిన స్థాయిలో నిలబడి,
అద్భుత భావజాల సమ్మిళిత ంతో, గొప్ప సజనాత్మక అనుభవాలను జోడించిన ఈ కవి, ఇజ్రాయిల్ చాలా పాశవికంగా పాలస్తీనా దేశంపై విరుచుకుపడుతున్న దాడిని తీవ్రమైన స్వరంతో ఖండిస్తూ 'నువ్వు ఎంత గట్టిగా కొడితే/ అంత గట్టిగా పైకి లేచి/ నరాల నిండా నెత్తుటి చైతన్యపు/ గాలితరంగాల్ని వెంటబెట్టుకొని/ చెక్కుచెదరని స్థైర్యంతో/ నిద్ర పోతున్న దిక్కుల/ గుండెలమీద గుద్ది మరీ/ మేల్కొపగల పాలస్తీనా/ పాలబుగ్గల తోలుబంతిని అంటూ తన కవితను దండోరా చేసి అందించిన శబ్దం, అక్షరాల తలపాగాలతో ఎప్పటికీ మనకు వినిపిస్తూనే వుంటుంది.


## PUBLIC NOTICE

This is to inform the general public that two cheques issued to me by other individuals have been lost / misplaced. I am unable to trace them despite thorough search. Details of the cheques are as follows:

1. **Cheque Numbers: 000460, ICICI Bank Limited, Karimnagar, (ICICI0001307)**
2. **Cheque Numbers: 798261, ICICI Bank Limited, Banjara Hills , (ICICI0000382)**

I hereby declare that I have not transferred, pledged, endorsed, or handed over the above-mentioned cheques to any person. If anyone finds or comes across these cheques, they are requested to contact me at the earliest.

I also state that any misuse of the above cheques by any unauthorized person will be illegal, and I shall not be held responsible for any fraudulent use. Suitable legal action will be initiated against such persons under applicable laws.

I am also in the process of informing the concerned bank to stop payment of the above cheques to prevent any misuse.

**Sd/-**
**DANTHULURI SRINIVAS VARMA,**
**“Aadhar no: 7097 6977 4361“Mobile: 9177863919“H.No. 1-5-1084/2/3, Mangapuram Colony, Old Alwal, Sec-bad, Telangana, Pin: 500010.**

# పండూ..నీ పేరెవరు పెట్టారూ!



'పండ్ల మహారాజు మామిడి గారొస్తున్నారహో' అంటూ దండోరా వేసే సమయం ఆసన్నమైంది. ఆ రాక కోసం దేశంలోని ప్రజలంతా వేయి కళ్లతో వేచి చూస్తుంటారు. మండుటెండల్లో పండు వెన్నెల్లా ఆనందాన్ని కలిగించే అనుభూతి కోసం ఎవరు మాత్రం ఎదురు చూడరు మరి! ఫలరాజు అంటే ఒక్కరేనా, యువరాజులు, సామంత రాజులు, జమీందార్లూ ఇలా ఓ పరివారమే మనల్ని పలకరిస్తుంది. అల్ఫాన్సో, దశ్‌హరి, చౌంసా, బంగినపల్లి ఇలా ఒక్కో రకానికీ ఒక్కో పేరూ, ప్రత్యేకతా! అసలు వాటికి ఆ పేర్లు ఎలా వచ్చాయి, ఎవరు పెట్టారు అన్న సంగతులు ఆద్యంతం ఆసక్తికరం!

మామిడి పండు ప్రపంచ ప్రసిద్ధి చెందిందే అయినా భారతదేశంలో మాత్రం దాని అభిమానులు చాలా ఎక్కువ. ఒక్క మన దగ్గరే దాదాపు 1500 రకాల మామిడి పండ్లు పండుతున్నాయి. మనం ఏటా 25 మిలియన్ మెట్రిక్ టన్నుల పండ్లను ఉత్పత్తి చేస్తున్నాం. ఇది ప్రపంచంలోనే అత్యధికం. భూమ్మీద పండుతున్న మామిడి పండ్లలో 45 శాతం వాటా భారత్‌దే. ఇంత ప్రాధాన్యం ఉన్న ఈ పండులో కొన్ని రకాలు మరింత ప్రాచుర్యం పొందాయి. వాటికి పేర్లు అవి పండే ప్రాంతాన్ని, పెంచిన వ్యక్తులను, వాటి రంగు రుచులను బట్టి వచ్చాయి. అందుకే ఒక్కో పేరూ ఒక్కో పండంత ప్రత్యేకం!

**అల్ఫాన్సో.. ఓ పోర్చుగీస్ జనరల్!:** భారతదేశంలో వ్యాపారం కోసం వచ్చిన విదేశీయుల్లో పోర్చుగీసు వాళ్లు ప్రప్రథములు. గోవా రాష్ట్రంలో వీరు ఎక్కువగా కాలనీలు నిర్మించుకుని నివసించారు. ఆ సమయంలోనే భారత్‌లో మామిడి పండ్లు వాళ్లను అమితంగా ఆకట్టుకున్నాయి. దీంతో వారు అంటుకట్టే విధానంలో రకరకాల మామిడి పండ్లను పండించడాన్ని ప్రారంభించారు. ఐరోపాలో పండేందుకు వీలుగా వీటిలో మార్పులు చేర్పులు చేశారు. అలా సృష్టించిన వాటిలో ఒక రకమే అల్ఫాన్సో. మంచి సువాసన, రంగు, ముక్కలు తరగడానికి వీలుగా ఉండే గుజ్జు దీని ప్రత్యేకతలు. ఇక, భారత్‌తోపాటు ఇతర ఆసియా దేశాల్లో పోర్చుగీసు కాలనీలు ఏర్పడటంలో కీలక పాత్ర పోషించిన గవర్నర్ అల్ఫాన్సో అల్‌బుకర్క్ పేరు మీదుగా దీనికి అల్ఫాన్సో మామిడిగా నామకరణం చేశారు. భారత్‌తోపాటు వివిధ దేశాల్లో చాలామంది ఇష్టపడే అల్ఫాన్సో ఖరీదైన మామిడి రకాల వరుసలో ఉంటుంది.

**తోతాపురి..చిలుక ముక్కు!:** మామిడి పండ్లలో మనకు సుపరిచితమైన రకాల్లో తోతాపురి తప్పకుండా ఉంటుంది. ఎక్కడ మామిడి పండ్లు ఉన్నా అక్కడ తోతాపురి రకం కనిపించకుండా ఉండదు అనేంతగా మన దగ్గర ఆ రకం పండ్లు దొరుకుతాయి. అయితే ఎరుపు ఆకుపచ్చల కలయికగా ఉండే ఈ పండుకు ఆ పేరు దాని ఆకృతి వల్లే వచ్చింది. హిందీలో తోతా అంటే చిలుక. ఈ పండు అచ్చం చిలుక ముక్కులా చివర్లో వంకర తిరిగి ఉంటుంది కనుక ఈ పండుకు చిలుక ముక్కు లేదా చిలుక ముఖం పండు అని పిలుస్తారు. కన్నడనాట గినిమూతి (చిలుకమూతి) మామిడి కాయగా పిలుస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఇది ఎక్కువగా పండుతుంది. ఇక, కర్ణాటకలో విరివిగా పండే బాదామి రకం పండ్లకు కూడా దాని బాదం గింజ ఆకృతిని బట్టే ఆ పేరు వచ్చిందట.

**సింధ్‌లో పండే సింధ్రీ!:** సింధ్రీ రకం మామిడి పండుకు అది పండే ప్రాంతాన్ని బట్టి పేరు వచ్చింది. స్వతంత్రం రావడానికి ముందు మనదేశంలో భాగంగా ఉన్న సింధ్ ప్రాంతంలో ఈ పండు పండేదట. ప్రస్తుతం సింధ్ పొరుగు దేశం పాకిస్థాన్‌లో ఉంది. ఒక రకమైన సువాసనతో, తీపిలోనే చిరు వగరు కలగలిపిన రుచితో ఉంటుందీ పండు. ఖరీదైన మామిడి పండ్లలో ఒక రకం ఇది. ఇక, దాదాపు ఇదే తరహా పేరుతో మన దగ్గర సింధూరి పండు పండుతుంది.



సిందూర వర్ణంలో ఉండే దీని గుజ్జును, చెక్కును బట్టి దీనికి సింధూరి అనే పేరును పెట్టారట. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో బాగా పండుతుంది.

**చౌంసా.. ఓ విజయం!:** మొఘల్ రాజు హుమాయూన్‌కీ, షేర్‌షా సూరికీ మధ్య బిహార్‌లోని చౌంసా అనే ప్రాంతంలో 1539లో యుద్ధం జరిగింది. ఇందులో షేర్ షా హుమాయూన్‌ని ఓడించాడు. ఆ విజయానికి గుర్తుగా ఆ ప్రాంతంలో పండే తనకిష్టమైన అమిత తీపి రకం మామిడి పండుకి చౌంసా అని పేరు పెట్టాడట షేర్ షా. ఆ విధంగా ఓ విజయానికి గుర్తుగా ఈ పండుకి పేరు ఏర్పడిందన్నమాట. బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో అధికంగా పండే ఇవి దేశమంతా అందుబాటులో ఉంటాయి.

**దశ్‌హరి.. ఓ ఊరి పేరు!:** మనకు బాగా తెలిసిన దశ్‌హరి మామిడి పండు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించింది. లక్నో నగరం దగ్గరి దశ్‌హరి గ్రామంలో తొలుత ఈ పండు పండింది. ప్రత్యేక రుచి కలిగిన ఈ మామిడి పండును అంటుకట్టడం ద్వారా సృష్టించాడు ఆ ప్రాంతపు జమీందారు అబ్దుల్ హమీద్ ఖాన్ కాందహారీ. ఆయన



మంచి వ్యవసాయవేత్త. ఎన్నో రకాలైన చెట్లు హమీద్ వ్యవసాయ క్షేత్రంలో ఉండేవి. అందుకే లక్నో నవాబు ఉండే ప్యాలెస్‌లోని తోటల్లోనూ పెంచేవారట. రాజులు అమితంగా వీటిని ప్రేమించడంతో బాగా పేరొచ్చింది. అక్కడినుంచి ఇవి దేశం మొత్తం మీదా మామిడి రకాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించాయి. తొలిచెట్టు దశ్‌హరి నుంచే వచ్చింది కాబట్టి ఆ పండుకు దశ్‌హరి అనే పేరే స్థిరపడిపోయింది. తెలుగు రాష్ట్రాల్లో బాగా ఫేమస్ అయిన బంగినపల్లి మామిడి పండు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లాలోని బనగానపల్లి అనే గ్రామానికి చెందిన రకం. ఆ ఊరి పేరు మీదుగానే దానికా పేరు వచ్చిందన్నమాట!

**లంగ్డా.. ఓ వ్యక్తి!:** మామిడి పండ్లలో పాలలాంటి వాసనతో ఉండే లంగ్డా రకం కూడా చాలామందికి ఇష్టం. హిందీలో కుంటివాడు అని అర్థం వచ్చే ఈ చిత్రమైన పేరు వెనుక ఒక కథ ఉంది. 250-300 సంవత్సరాల క్రితం ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో ఒక రైతు తోటలో మొట్టమొదట ఈ చెట్టు ఉండేదట. ఎంతో జాగ్రత్తగా తన మామిడి తోటను చూసుకునే వాడట ఆ రైతు.

అందులో కాసిన వాటిలో, ఈ రకం ప్రత్యేకంగా ఎంతోమందిని ఆకట్టుకున్నాయి. ఇక, ఆయన ఏదో సమస్య వల్ల కుంటుతూ నడిచేవాడట. దీంతో ఆ రైతు తోటలోవి అని చెప్పడానికి లంగ్డా ఆమ్ అని చెప్పేవారట. ఆ తర్వాత ఈ చెట్టు బిహార్‌తోపాటు తెలంగాణ తదితర దక్షిణాది రాష్ట్రాలకు పరిచయమైంది.

## కాఫీని రోజూ అతిగా సేవిస్తున్నారా..?

### మోతాదుకు మించితే ఏం జరుగుతుంది..? ఎన్ని కప్పుల కాఫీ తాగాలి..?




రోజూ ఉదయం నిద్ర లేచిన వెంటనే చాలా మంది కాఫీని సేవిస్తుంటారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ చేసిన తరువాత నుంచి మొదలుకొని రోజంతా నాలుగైదు కప్పుల కాఫీ తాగనిదే చాలా మందికి తృప్తిగా అనిపించదు. అయితే కాఫీని తాగడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ కాఫీని మరీ మోతాదుకు మించి తాగకూడదు. కాఫీని అతిగా సేవించడం వల్ల మన ఆరోగ్యానికి హాని కలుగుతుంది. కాఫీ సేవిస్తే టైప్ 2 డయాబెటిస్, పార్కిన్సన్స్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. కానీ మోతాదుకు మించి కాఫీని తాగడం వల్ల అనేక దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాఫీ మన నాడీ మండల వ్యవస్థపై నేరుగా ప్రభావం చూపిస్తుంది. దీంతో ఆందోళన, కంగారు, ఒత్తిడి వంటి సమస్యలు వస్తాయి. గుండె ఆరోగ్యం దెబ్బ తినే అవకాశం..: కాఫీని మోతాదుకు మించి సేవిస్తే అది నిద్రపై ప్రభావాన్ని చూపిస్తుంది. రాత్రి పూట త్వరగా నిద్ర పట్టదు. నిద్రలేమి సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. మన శరీరంలో కెఫీన్ మోతాదు అధికమైతే గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. ఇది గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. కాఫీ మోతాదుకు మించితే జీర్ణాశయంలో యాసిడ్ల ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో గుండెల్లో మంట,పొట్టలో అసౌకర్యంవంటిసమస్యలు ఏర్పడుతాయి. అలాగే కాఫీ సహజసిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. ఇది సున్నితమైన జీర్ణాశయం ఉన్నవారిలో విరేచనాలను కలగజేస్తుంది. కాఫీలో ఉండె కెఫీన్ మన శరీరంలో అధికంగా చేరితే బీపీ పెరుగుతుంది. ఇది దీర్ఘకాలంలో హైబీపీ సమస్యకుదారి తీస్తుంది. దీంతో గుండె ఆరోగ్యం దెబ్బతిని హార్ట్ ఎటాక్ కూడావచ్చే ప్రమాదంఉంటుంది.

డీహైడ్రేషన్‌కు అవకాశం..: కాఫీ డైయురెటిక్‌గా పనిచేస్తుంది. ఇది మూత్రం ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో శరీరంని నీరు త్వరగా బయటకు పోతుంది. ఫలితంగా డీహైడ్రేషన్ బారిన పడతారు. కనుక కాఫీని అధికంగా తాగకూడదు. కాఫీ తాగడం వల్ల మూడ్ మారుతుంది. ఉత్తేజంగా మారుతారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. అయితే కేవలం ఒక కప్పు కాఫీ తాగితేనే ఈ ప్రయోజనాలు కలుగుతాయి. మోతాదుకు మించి కాఫీ సేవిస్తే దీనికి శరీరం రివర్స్‌లో పనిచేస్తుంది. అంటే శక్తి మొత్తం కోల్పోయినట్లు అవుతారు. నీరసం, అలసట వస్తాయి. ఏ పనిచేయలేకపోతారు. కనుక కాఫీని అధికంగా తాగుతున్న వారు ఈ విషయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది. కాఫీని మోతాదులో సేవిస్తే తలనొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు. కానీ అధికంగా సేవిస్తే మాత్రం తలనొప్పి ఎక్కువవుతుంది. ఎంత మోతాదులో..?: కాఫీని రోజూ ఎంత మోతాదులో సేవించాలి.. అని చాలా మంది సందేహం వ్యక్తం చేస్తుంటారు.

కాఫీ రోజుకు 2 కప్పులకు మించకూడదు. ఒక కప్పు కాఫీ తాగితే మనకు సుమారుగా 200 మిల్లీగ్రాముల మేర కెఫీన్ లభిస్తుంది. నిపుణులు చెబుతున్న ప్రకారం మనకు రోజుకు 400 మిల్లీగ్రాముల మేర కెఫీన్ సరిపోతుంది. అందువల్ల రోజుకు 2 కప్పుల కాఫీని సేవిస్తే చాలు. అంతకు మించితే అనేక దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

## మెడ నల్లగా మారుతుందా?



వేసవిలో బయట పనులు చేసేవారి మెడ నల్లగా మారిపోతుంటుంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా మెడను సరిగ్గా శుభ్రం చేయకపోవడం వల్ల, శరీరంలో ఐరన్ తగ్గడం వల్ల మెడ నల్లగా మారుతుంది. స్థూలకాయం పెరగడం, ఇన్సులిన్ రెసిస్టెన్స్, జన్యుపరమైన కారణాలు, పీసీఓడీ సమస్య, పెర్ఫ్యూమ్ ఎక్కువగా వాడడం వల్ల అలర్జీలు, డయాబెటిస్, హైపో థైరాయిడిజం వల్ల కూడా మెడ నల్లబడుతూ ఉంటుంది. వేసవిలో వచ్చే ఈ సమస్యను ఇలా నివారించుకోవచ్చు. వేసవిలో మెడ నలుపును పోగొట్టుకోవాలంటే మెడపై స్కార్ఫ్‌తో కప్పుకోవాలి. ఒక గిన్నెలో టూత్‌పేస్ట్ తీసుకొని దానికి కొన్ని చుక్కల నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఈ పేస్ట్‌ని మెడలోని నల్లటి భాగంలో బాగా రాయాలి. 10 నిమిషాల పాటు అప్లై చేసుకుని, ఆపై శుభ్రమైన నీటితో మెడను కడగాలి. వారానికి రెండు సార్లు ఇలా అప్లై చేయడం వల్ల మెడ ముదురు రంగు పోతుంది. ఒక చెంచా శనగపిండిని తీసుకుని, దానికి చిటికెడు పసుపు వేసి, ఒక చెంచా పెరుగు వేసి బాగా కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ పేస్ట్‌ను మెడపై అప్లై చేసి 20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. 20 నిమిషాల తర్వాత, టవల్ లేదా మెత్తటి వస్త్రంతో మెడను శుభ్రంగా తుడవాలి. ఈ పేస్ట్‌ని వారానికి రెండు సార్లు అప్లై చేయడం వల్ల చర్మం రంగు మెరుగవుతుంది. యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో కూడిన కలబంద జెల్‌ను మెడకు పట్టించి కొంతసేపు మసాజ్ చేయాలి. ఈ జెల్‌ను రాత్రి పూట రాసుకుంటే మంచిది. రాత్రంతా మెడపై జెల్ వదిలి ఉదయం కడగాలి.

## రోజూ కొర్రలను ఆహారంలో భాగం చేసుకుంటే

# కలిగే అద్భుతమైన ప్రయోజనాలు

ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరుగుతున్న చాలా మంది పోషకాలు కలిగే ఉండే ఆహారాలను తినేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. అందులో భాగంగానే చాలా మంది మిల్లెట్లను ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. వీటినే చిరు ధాన్యాలు లేదా సిరి ధాన్యాలు అని కూడా పిలుస్తారు. మిల్లెట్లను తినడం వల్ల ఎంతగానో ప్రయోజనం ఉంటుందని పోషకాహార నిపుణులు, ప్రకృతి వైద్య నిపుణులు చెబుతుండడంతో మిల్లెట్లకు డిమాండ్ బాగానే పెరిగింది. మిల్లెట్లతో చేసిన అనేక ఆహారాలు, తినుబండారు, బిస్కెట్లు వంటివి కూడా మనకు అందుబాటులో ఉంటున్నాయి. అయితే మిల్లెట్లలో వేటికవే అనేక ప్రత్యేకతలను కలిగి ఉన్నా చాలా మంది తింటున్న వాటిలో కొర్రలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. మన పూర్వీకులు కొర్రలను అధికంగా తినేవారు. కొర్రలను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

**అనేక పోషకాలు..:** కొర్రలలో అనేక పోషకాలు ఉంటాయి. వీటిల్లో ఉండే కార్బొహైడ్రేట్లు మన శరీరానికి శక్తిని అందిస్తాయి. కొర్రలలో ఉండే ప్రోటీన్లు కండరాలకు శక్తిని అందించి కండరాలు నిర్మాణం అయ్యేలా చూస్తాయి. కొర్రల్లో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆకలిని నియంత్రిస్తుంది. షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తుంది. కొర్రలలో నియాసిన్, థయామిన్, రైబోఫ్లేవిన్ అనే పలు రకాల బి విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. ఐరన్, మెగ్నిషియం,



ఫాస్ఫరస్, పొటాషియం, క్యాల్షియం, జింక్, మాంగనీస్ వంటి మినరల్స్ కూడా కొర్రల్లో సమృద్ధిగా ఉంటాయి. ఇవన్నీ మన శరీరంలో జీవక్రియలు సరిగ్గా నిర్వహించేందుకు దోహదం చేస్తాయి.

**డయాబెటిస్, గుండె జబ్బులకు..:** కొర్రల గ్లైసీమిక్ ఇండెక్స్ (జీఐ) విలువ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల కొర్రలను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు అమాంతం పెరగవు. పైగా వీటిల్లో ఉండే ఫైబర్ షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తుంది. కనుక డయాబెటిస్ ఉన్నవారు కొర్రలను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. కొర్రలలో ఉండే ఫైబర్ చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్డీఎల్)ను పెంచుతుంది.

దీంతో బీపీ, కొలెస్ట్రాల్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. ఇది గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూస్తుంది. కొర్రలలో అధికంగా ఉండే ఫైబర్ కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది.


**ఎముకల దృఢత్వానికి..:** కొర్రలలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. మలబద్ధకం ఉన్నవారు రాత్రి పూట కొర్రలను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. కొర్రలలో ఫినోలిక్ సమ్మేళనాలు, ఫ్లేవనాయిడ్స్, టానిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. ఫలితంగా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. కొర్రలలో క్యాల్షియం కూడా అధికంగానే ఉంటుంది. ఇది ఎముకలను బలంగా మారుస్తుంది. ఎముకలు విరిగి ఉన్నవారు కొర్రలను ఆహారంలో భాగం చేసుకుంటే ఎముకలు త్వరగా అతుక్కునేలా చేయవచ్చు. ఇలా కొర్రలను తింటే అనేక అద్భుతమైన లాభాలను పొందవచ్చు.

## తాటి ముంజెల్లో మేటి పోషకాలు



ఎటువంటి రసాయనాలు లేకుండా సహజసిద్ధంగా తియ్యని రుచిని ఇచ్చే తాటిముంజెల్లో ఆరోగ్యపోషకాలు ఎక్కువగా ఉంటాయి. తాటి ముంజెల్లో విటమిన్ బి-7, విటమిన్-కె, కరిగే ఫైబర్, పొటాషియం, కాల్షియం, విటమిన్-ఎ, విటమిన్-సి, విటమిన్-డి, జింక్, ఐరన్, పోషకాలు ఉంటాయి. నీటిశాతం ఎక్కువగా ఉండటం వల్ల వేసవిలో వడదెబ్బ తగలకుండా వుంటుంది. శరీర ఉష్ణోగ్రతను తగ్గించి శరీరాన్ని చల్లబరుస్తాయి. డీహైడ్రేషన్ బారిన పడకుండా చేస్తాయి. వీటిలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. రక్తపోటు, గుండె ఆరోగ్యాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. శరీరంలోని హానికరమైన వ్యర్థాలను తొలగించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. వేసవిలో క్రమం తప్పకుండా తీసుకుంటే కాలేయ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. తాటి ముంజలు తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ పోతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. వీటిలోని పోషకాలు జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. వేసవిలో ఎండ వల్ల వచ్చే వికారం, వాంతులు రాకుండా ఉంటాయి. మహిళల్లో రొమ్ము క్యాన్సర్ అవకాశాలను బాగా తగ్గిస్తాయి. వేసవిలో వచ్చే చికున్ గున్యాను నివారిస్తాయి. శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. శరీరంలోని అధిక బరువును తగ్గించడంలో ఎంతగానో సహకరిస్తాయి.

# వ్యయ బిల్లుకు సెనెట్ ఆమోదం



- త్వరలో ముగియనున్న షట్‌డౌన్
- అనుకూలంగా ఓటేసిన ఎనిమిదిమంది డెమొక్రాట్లు
- ఆరోగ్య సబ్సిడీల కొనసాగింపుపై ప్రభుత్వం హామీ ఇవ్వకపోయినా సమర్ధన
- దీనిపై వచ్చే నెలలో ఓటింగ్
- డెమొక్రాట్ల శిబిరంలో దుమారం

వాషింగ్టన్: అమెరికాలో 40 రోజులుగా కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్‌కు శుభం కార్డు పడబోతోంది. ప్రభుత్వ వ్యయ బిల్లుకు ఎట్టకేలకు సెనెట్ ఆమోదం లభించింది. బిల్లును 60 మంది సమర్ధించగా 40 మంది వ్యతిరేకించారు. ఇప్పుడది ప్రతినిధుల సభ ముందుకు వెళ్తుంది. ఆ తర్వాత సంతకం కోసం దానిని దేశాధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్ వద్దకు పంపుతారు. ఆయన సంతకం చేయగానే షట్‌డౌన్ ముగుస్తుంది. ఈ ప్రక్రియకు అనేక రోజుల సమయం పడుతుంది. ట్రంప్, రిపబ్లికన్లు ప్రతిపాదించిన ఒప్పందానికి ఎనిమిదిమంది డెమొక్రాట్లు మద్దతు తెలిపారు. దీంతో సెనెట్‌లో వ్యయ బిల్లు ఆమోదం పొందింది. కీలకమైన ఆరోగ్యపరమైన భరోసాను కల్పించే ఒబామా కేర్ ఒప్పందం లేకుండా డెమొక్రాట్లు వెనక్కి తగ్గి బిల్లుకు మద్దతు తెలిపి భయంకరమైన తప్పు చేశారని సోషలిస్టు, సెనేటర్ బెర్నీ స్టాండర్స్ విమర్శించారు.

ఏం జరుగుతుంది?: వ్యయ బిల్లును సెనెట్ ఆమోదించడంతో ప్రభుత్వం కొన్ని నిధులు మంజూరు చేయగలుగుతుంది. ఆహార సాయం, వృద్ధుల కార్యక్రమాలు, ఆరోగ్య రక్షణ వంటి పద్దులకు వచ్చే ఏడాది జనవరి 30వ తేదీ వరకూ నిధులు సమకూరుతాయి. రిపబ్లికన్లు, డెమొక్రాట్ల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు%ొ%. షట్‌డౌన్ కాలంలో తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకుంటారు. నోటీసులు అందుకున్న వారు కూడా ఉద్యోగాలలో చేరతారు. షట్‌డౌన్ సమయంలో ప్రభుత్వ కార్యక్రమాలకు తమ సొంత నిధులు ఖర్చు చేసిన రాష్ట్రాలకు వాటిని రీయంబర్స్‌మెంట్ చేస్తారు. ప్రభుత్వానికి నిధులు అందించే ద్వైపాక్షిక బిల్లులను ఒప్పందంలో చేర్చారు. ఆరోగ్య సబ్సిడీల పొడిగింపుపై వచ్చే నెలలో ఓటింగ్: సెనెట్‌లో రిపబ్లికన్లకే మెజారిటీ ఉంది.

రిపబ్లికన్లు 53 మంది ఉండగా డెమొక్రాట్ల సంఖ్య 47 మాత్రమే. వ్యయ బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 60 ఓట్లు అవసరమవుతాయి. అంటే కనీసం మరో ఏడుగురు సభ్యుల మద్దతు అవసరమవుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును సమర్ధించేందుకు ఎనిమిదిమంది డెమొక్రాట్లు అంగీకరించారు. బిల్లుకు తాను మద్దతు ఇవ్వబోనని సెనెట్ మైనారిటీ నాయకుడు చక్ స్కమర్ స్పష్టం చేశారు. కొందరు డెమొక్రాట్లతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం అఫోర్డబుల్ కేర్ చట్టం (ఆరోగ్య సంరక్షణ) కింద సబ్సిడీలను పొడిగించేందుకు ఉద్దేశించిన బిల్లుపై డిసెంబరులో ఓటింగ్ జరుగుతుంది. డెమొక్రాట్ల శిబిరంలో అలజడి: వ్యయ బిల్లుపై సుమారు రెండు గంటల పాటు సెనెట్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. టెక్సాస్ సెనెటర్ జాన్ కార్నిన్ వ్యయ బిల్లుకు అనుకూలంగా చిట్టచివరి ఓటు వేశారు. మితవాద డెమొక్రాట్లు బిల్లుకు అనుకూలంగా ఓటేయడంతో అది గట్టెక్కింది. దీనిపై డెమొక్రాట్ల శిబిరంలో అలజడి రేగింది. ట్రంప్ ప్రభుత్వంపై పోరాటం కొనసాగించాలని అమెరికన్లు కోరుకుంటున్నారని పలువురు డెమొక్రాట్లు గుర్తు చేశారు. న్యూ హ్యాంప్‌షైర్, నెవాడాలకు చెందిన ఇద్దరేసి డెమొక్రాట్ సెనెటర్లతో పాటు వర్జీనియా, ఇల్లినాయిస్, పెన్సిల్వేనియా సెనెటర్లు కూడా బిల్లుకు అనుకూలంగా ఓటేశారు. డెమొక్రాట్ల శిబిరంలో ఉన్న ఒక స్వతంత్ర సెనెటర్ సైతం బిల్లును సమర్ధించారు. దీంతో బిల్లు ఆమోదానికి అవసరమైన అదనపు ఓట్లు లభించాయి. షట్ డౌన్ కాలంలో దాదాపు 75 వేల మంది ఫెడరల్ ఉద్యోగులను తొలగించారు. లక్షలాది పేదలకు ఆహారం సరఫరాకు అంతరాయం కలిగింది. దేశవ్యాప్తంగా విమానాలకు అంతరాయం ఏర్పడింది. ఆరోగ్య సంరక్షణ, సబ్సిడీలను కొనసాగించేందుకు స్పష్టమైన హామీ ప్రభుత్వం ఇవ్వకపోయినప్పటికీ బిల్లుకు కొందరు డెమొక్రాట్లు మద్దతు తెలపడం గమనార్హం.

# టచ్ స్క్రీన్ ద్వారా దర్శనం టిక్కెట్లు..!

**కర్నూలు,తెలంగాణ దిశ:**ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖ దేవాలయాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆలయాల్లో వంద కియోస్క్ లు ఏర్పాటు చేయనున్నారు. టచ్ స్క్రీన్‌ఉండే వీటి ద్వారాభక్తులు దర్శనం, వివిధ సేవల టికెట్లు నేరుగా పొందొచ్చు. వీటిలో ఎన్ని టికెట్లు కావాలో నమోదు చేసి.. డిజిటల్ చెల్లింపు చేస్తేవెంటనే టికెట్లు జారీ చేస్తుంది. కరూర్ వైశ్యా బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఈ కియోస్క్ మెషిన్లను ఉచితంగా అందిస్తోంది. ఈకొత్త కియోస్క్‌లు భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటాయి. ఇకపై క్యూలైన్లో నిలబడాల్సిన అవసరం లేకుండా,తమకు కావాల్సిన దర్శనం, సేవల టికెట్లను నేరుగా ఈ స్క్రీన్ కియోస్క్ మెషిన్‌ల ద్వారా కొనుగోలు చేయొచ్చు. ఉద్యోగులు అవసరం లేకుండానే నేరుగా టికెట్లు పొందేలా వీలు కల్పిస్తున్నారు. ఈ విధానం ద్వారాఆలయాల నిర్వహణపై భారం తగ్గుతుంది. అయితే, వాటి ఇన్ స్టలేషన్, నిర్వహణ బాధ్యతలను కరూర్ వైశ్యా బ్యాంకు చూ సుకోనుంది. ఏపీలోని ప్రధాన ఆలయాలైన విజయవాడ కనకదుర్గమ్మ, సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి దేవాలయాల్లో ఎనిమిది చొప్పున వీటిని ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా ముఖ్య ఆలయాలైన అరసవిల్లి, విశాఖ కనకమహాలక్ష్మి, తలుపులమ్మ, వాడపల్లి, పెనుగంచిప్రోలు, మహానంది, బేతంచెర్ల మద్దిలేటి నరసింహస్వామి, కసాపురం ఆంజనేయస్వామి, కదిరి లక్ష్మీనరసింహస్వామి,బోయకొండ గంగమ్మ ఆలయాల్లో మూడేసి కియోస్క్ మెషిన్లు ఏర్పాటు చేయనున్నారు. తిరుమలలో ఇప్పటికే కియోస్క్ మెషిన్లను ఉపయోగిస్తున్నారు. అన్నప్రసాద వితరణ కేంద్రంలో భక్తులు విరాళాలు అందజేసేందుకు ఈ కియోస్క్ మెషిన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. లడ్డూ విక్రయాల కోసం కూడా కియోస్క్ మెషిన్లను ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా.. రాష్ట్రంలోని ప్రధాన, ముఖ్యమైన ఆలయాల్లో వీటిని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

# ఎన్ హెచ్ 65 గేమ్ ఛేంజర్ కాబోతోందా?

విజయవాడ, : ఏపీలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ఆసక్తి చూపించటం, మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణం వంటి కారణాలతో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటోంది. మరోవైపు విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీంతో విజయవాడ శివారు ప్రాంతమైన ఉయ్యూరు వంటి చోట్ల భూములకు డిమాండ్ పెరుగుతోందని.. రియల్ ఎస్టేట్ వర్గాలు చెప్తున్నాయి. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగానికి జాతీయ రహదారి విస్తరణ గేమ్ ఛేంజర్ అవుతుందని అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏపీలో అనేక మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణంలో వేగం పెరిగింది. కేంద్రంలోని ఎన్డీఏ సర్కారులో టీడీపీ, జనసేన పార్టీలు కీలక భాగస్వామ్యులుగా ఉండటంతో రాష్ట్రంలోని జాతీయ రహదారులు, రైల్వే లైన్ల నిర్మాణంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి తగిన మద్దతు లభిస్తోంది. మరోవైపు మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణంతో ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటూ ఉండటంతో .. ఆయా ప్రాంతాల్లో భూములకు మంచి డిమాండ్ వస్తోంది. తాజాగా విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి (ఎౌఈ -65) విస్తరణపై అధికారులు దృష్టి సారించారు. విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాలని ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే కన్సల్టెన్సీ సంస్థ సమగ్ర ప్రాజెక్టు నివేదిక కూడా రూపొందించింది. అయితే విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ పనులు పట్టాలెక్కితే విజయవాడ శివారు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ పుంజుకుంటుందని రియల్ ఎస్టేట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ఉయ్యూరు లాంటి ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ పుంజుకోవ దానికి ఈ ప్రాజెక్టు గేమ్ ఛేంజర్ అవుతుందని చెప్తున్నాయి. పరిశ్రమ లు విస్తరించడం, మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో ఈ ప్రాంతంలో ఆస్తి విలువలు పెరుగుతాయని, ఇళ్లకు డిమాండ్ ఏర్పడు తుందని.. అలాగే ఈ ప్రాంత జీవనశైలిలోనూ మార్పులు వచ్చే అవకాశాలు ఉందంటున్నారు. ప్రస్తుతం విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి -65 ముఖ్యమైన మార్గంగా ఉంది. విజయవాడను పోర్టు సిటీ అయిన మచిలీపట్నంతో కలిపే రహదారి ఇదే. అయితే పరిశ్రమలు, లాజిస్టిక్స్, వాణిజ్యం పెరిగే కొద్దీ, ఈ రహదారిపై వాహనాల రాకపోకలు పెరిగాయి. దీంతో ఈ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించారని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలు ఇబ్బందులు ఉండవని, ప్రయాణం మరింత వేగంగా, సౌకర్యవంతంగా మారుతుందని అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే ఈ కారిడార్ వెంబడి ఖరీదైన విల్లాలు, కమర్షియల్ హబ్స్, నివాస ప్రాంతాలు ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ కారణంగా ఉయ్యూరు వంటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ బూమ్ వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో మౌలిక వసతుల నిర్మాణం, పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని.. ఈ నేపథ్యంలో భూములకు మంచి డిమాండ్ ఏర్పడుతుందని చెప్తున్నారు.

# రాళ్లవాగులో వజ్రాల వేట



**కర్నూలు,తెలంగాణ దిశ:**వర్షాకాలం ప్రారంభం అయితేచాలు ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ జిల్లాల్లో వజ్రాల వేట మొదలవుతుంది. తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఎక్కడెక్కడి నుంచో జనాలు తరలివస్తుంటారు. రోజుల తరబడి పొలాల్లో కూర్చుని వజ్రాల కోసం గాలిస్తుంటారు. ప్రతి సంవత్సరం కొందరికైనా వజ్రాలు దక్కుతాయి. దక్కని వారు.. వచ్చే సంవత్సరం చూసుకుందాం అని వెళ్లిపోతారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో ప్రాంతం చేరింది. అక్కడ వజ్రాలు దొరుకుతున్నాయంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతుండటంతో.. జనాలు తండోపతండాలుగా అక్కడకు తరలి వస్తున్నారు. మరి నిజంగానే అక్కడ వజ్రాలు దొరుకుతున్నాయా అంటే..ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల అడవిలో పారే రాళ్లవాగు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఇక్కడ వజ్రాలు దొరుకుతున్నాయంటూ ప్రచారం సాగుతుండటంతో.. రాళ్ల వాగు కాస్త వజ్రాల వాగుగా మారింది. మరి నిజంగానే ఇక్కడ వజ్రాలు దొరుకుతున్నాయా అంటే.. ఇప్పటి వరకు డైమండ్స్ దొరికిన వాళ్లు ఒక్కరు కూడా లేదు. కానీ సోషల్ మీడియాలో ప్రచారం చూసి స్థానిక ప్రాంత ప్రజలు, పేదలు, కూలీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడం కోసం రాళ్ల వాగు వద్దకు తరలి వస్తున్నారు. ఈ వాగులో వజ్రాల కోసం వేట కొనసాగుతుండటంతో రాళ్లవాగు ఇప్పుడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ రాళ్ల వాగు.. మహానంది మండలంలోని గాజులపల్లె గ్రామ సమీపంలో.. నల్లమల అడవిలో ఉన్న పురాతన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం కింది భాగంలో ప్రవహిస్తూ ఉంటుంది. అయితే ఈస్వామి వారి కళ్యాణం సందర్భంగా వజ్రాలతో తలంబ్రాలు పోశారని స్థానికులు నమ్ముతారు. ఈ వజ్రాలు కాస్త.. ఆలయం క్రింద భాగంలో ప్రవహించే రాళ్లవాగులో కలిశాని.. అందుకే ఇక్కడ వజ్రాలు దొరికేందుకు అవకాశం ఉంది అంటున్నారు. అలానే ఈ రాళ్ల వాగును వజ్రాల వాగుగా పిలుస్తు న్నారు. గత కొన్నేళ్లుగా ఈ వాగులో వజ్రాలు లభ్యమవుతున్నాయనే ప్రచారం ఉండేది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వజ్రాల మీద ఆశతో.. వాగు వెతుకుతున్నారు. అయితే ఎవరికి ఏ వజ్రం దొరకలేదని చెబుతున్నారు. కేవలం సుద్దరాళ్లు మాత్రమే లభిస్తున్నాయని తెలుస్తోంది. ఈ ప్రాంతం.. గాజులపల్లె రైల్వే స్టేషన్‌కు సమీపంలోనే ఉండటం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉండటంతో మహిళలు కూడా ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. ఎవరికైనా వజ్రం దొరికిందని అనుమానం కలిగితే.. దానిని పరీక్షించేందుకు అక్కడే కొందరు వ్యక్తులు పరికరాలతో పరీక్షిస్తున్నారు. అయితే గతంలో ఒక్క రాయి పరీక్షించేందుకు 10 రూపాయలు తీసుకుంటే, ఇప్పుడు రూ.30 తీసుకుంటున్నారు. ఇక్కడ వజ్రాలు అయితే దొరకడం లేదు కానీ.. హోటళ్లు, కూల్ డ్రింక్ షాపులు, ఐస్ క్రీములు అమ్మే బండ్లకు మాత్రం మంచి వ్యాపారం జరుగుతోంది.

# సైనిక విన్యాసాలతో వ్యూహాత్మక చర్యలు

న్యూఢిల్లీ : భారత దేశం సొంత భద్రత, శత్రువులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకుంటోంది. ఇదే సమయంలో దేశంలోకి చొరబాట్లను అడ్డుకునేందుకు వ్యూహాత్మకంగా చర్యలు చేపడుతోంది. స్వదేశీ ఆయుధాల తయారీకి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో దేశం తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిశల్లో ఒకేసారి సైనిక విన్యాసాలు చేపడుతోంది. గగనతల సురక్షణ కోసం ప్రభుత్వమే ముందస్తు హెచ్చరికలతో నోటామ్ జారీ చేసింది. సరిహద్దుల్లో పెరుగుతున్న భద్రతా సవాళ్లను ఎదుర్కోవడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్లు నిర్వహిస్తోందిఅరేబియా సముద్రతీరంలోని సర్‌క్రీక్(బాణగంగ) ప్రాంతంలో ఆపరేషన్ త్రిశూల్ విజయవంతంగా కొనసాగుతోంది. పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంగా ఉన్న ఈ ప్రాంతం వ్యూహాత్మకంగా అత్యంత ప్రాధాన్యత కలిగినది. సముద్ర మార్గ రక్షణకు నేవీ కీలక పాత్ర పోషిస్తూ రాడార్ నిఘా వ్యవస్థలు, అధునాతన మిసైల్ యూనిట్లు మోహరిస్తోంది. చైనా, బంగ్లాదేశ్, నేపాల్ సరిహద్దులకు సమీపంలోని సిరివిడి కారిడార్ ప్రాంతంలో పూర్వి ప్రచండ ప్రహార్ పేరుతో యుద్ధాభ్యాసం కొనసాగుతోంది. 15 నుంచి 22 కిలోమీటర్ల పొడవున ఈ వ్యూహాత్మక మార్గం ద్వారా శత్రు చొరబాట్లను నిరోధించ డమే కాదు, త్రిశక్తి బలగాల సమన్వయం కూడా బలోపేతం అవుతోం ది. అసోంలోనినదుల విస్తీర్ణం కారణంగానేవీకి కీలకబాధ్యత వచ్చింది. రఫేల్స్, బ్రహ్మోస్, ఎస్-400 క్షిపణి వ్యవస్థలను సరిహద్దు ప్రాంతాల్లో మోహరించడం ద్వారా గగనతల రక్షణను మరింత ధ్రుఢపరుస్తున్నారు. మూడు విభిన్న రక్షణ శాఖలు కలిసి పనిచేసే "త్రిశక్తి కోర్" ద్వారా సర్వదిశా భద్రతా వ్యవస్థ బలోపేతమవుతోంది. సమయంలో దేశంలోని ఈశాన్య భారతంలో మూడు సరికొత్త సైనిక కారిడార్లు నిర్మిస్తోంది. అసోం, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కొత్త మిలిటరీ బేస్‌ల నిర్మాణం మొదలైంది. అసోంలోని దుగ్రి జిల్లా, బాముని గ్రామంలో లాచిట్ బర్ఫూకన్ పేరుతో ఆర్మీ బేస్ నిర్మాణం జరుగుతోంది. అసోం వీరయోధుడి స్ఫూర్తితో రూపొందిన ఈ స్థావరం మిసామారీ బేస్‌కు అనుబంధంగా సిరివిడి కారిడార్ భద్రతను చూసుకుంటుంది. ఇక రెండోది బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో నిర్మిస్తోంది. తూర్పు సరిహద్దులో రక్షణ వలయం ఏర్పరచే కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. మూడోది పశ్చిమబెంగాల్‌లోని చోప్రా గ్రామంలో జినాబ్ ప్రాంతంలో తెతూలియా కారిడార్ సమీపంలో నిర్మిస్తోంది. ఈ స్థావరం వ్యూహాత్మకంగా అత్యంత ప్రాధాన్యం కలిగినది. దీనిని నిర్మాణం పూర్తయితే పశ్చిమబెంగాల్‌లోని చాలా ప్రాంతాలకు దూరం తగ్గుతుంది. అసోంలో గతంలో జరిగిన చొరబాట్లు, హింసాత్మక దాడులు ఇప్పుడు గణనీయంగా తగ్గాయి. ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నేతృత్వంలో సరిహద్దు భద్రతపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు సైన్యంతో సమన్వయం పెరగడంఈ మార్పుకు కారణంగా ఉంది. తాజాగా బహుముఖ చర్యలతో భారతదేశం గగన, భూ, సముద్ర మార్గాల్లో త్రిముఖ సమన్వయంతో దేశ రక్షణను మరింత శత్రుదుర్భేధ్యంగా మార్చుతోంది.

## సీఐఐ సదస్సుకు 40 కోట్లు

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ:** ఏపీ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే విశాఖలో జరగనున్న ప్రపంచ స్థాయి భాగస్వామ్య సదస్సుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. సుమారు 40 దేశాల నుంచి 3 వేల మంది ప్రతినిధులు రానుండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సదస్సులో సుమారు 10 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకునేందుకు 40 కోట్ల రూపాయలతో విశాఖను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆంధ్ర యూనివర్సిటీలో ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు విశాఖ సిద్ధమవుతోంది. ప్రపంచ స్థాయి వసతులతో అతిథులకు ఆతిథ్యం ఇచ్చేలా ప్రభుత్వంసన్నాహాలు చేస్తోంది. ఏర్పాట్లలోఎక్కడా రాజీ లేకుండా ఆంధ్ర యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నారు. మరింత సమాచారం మా ప్రతినిధి శివశంకర్ అందిస్తారు. పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకునేలా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు మరోవైపు విశాఖలోని ప్రధాన కూడళ్లను ప్రభుత్వం ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతోంది. కూడళ్లలో ఏర్పాటు చేస్తున్నఅద్భుత కళాఖండాలు, వాటర్ ఫౌంటెన్లు అబ్బుర పరుస్తున్నా యి. పెట్టుబడులకు ముఖద్వారం విశాఖనే అనేలా ముస్తాబు చేస్తున్నారు.

# పర్యాటకం కోసం హోమ్ స్టే...

**తిరుపతి,తెలంగాణ దిశ:**పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హోమ్‌స్టే విధానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీని ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు.. పర్యాటకులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వసతి కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా ఔత్సాహికులు హోమ్ స్టేలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ మేరకు హోమ్ స్టే ఏర్పాటు చేయడానికి సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా అనేక చర్యలు తీసుకుంటోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్య క్షేత్రాలు,

పర్యాటక ప్రాంతాల్లో.. సామాన్య పర్యాటకులకూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన వసతి కల్పించేందుకు ప్రభుత్వం హోమ్‌స్టే విధానం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. స్థానికులతో కలిసి సొంతింట్లో ఉన్న అనుభూతిని పర్యాటకులకు కల్పించడమే లక్ష్యంగా ఈ విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని ద్వారా గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విధానం అమలులో భాగంగా ఔత్సాహికులు హోమ్ స్టేలను ఏర్పాటు చేసుకునేలా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అందుకు సంబంధిచిన మార్గదర్శకాలు జారీ చేసింది.


పర్యాటక శాఖ మార్గదర్శకాల ప్రకారం..

హోమ్ స్టే ఏర్పాటు చేయాలనుకునే ఇంటి యజమానులు.. అక్కడే నివాసం ఉండాలి. వారు.. తమ ఇంట్లో కనీసం ఒకటి.. గరిష్ఠంగా ఆరు గదులను పర్యాటకులకు అద్దెకు ఇవ్వొచ్చు. ఇంట్లో కనీస వసతులు.. సురక్షిత మంచినీరు వంటివి అందుబాటులో ఉండాలి. శుభ్రమైన పరిసరాలు, టాయిలెట్లు ఉండాలి. ఏసీ, టీవీ, ఇంటర్నెట్, ఫర్నిచర్ వంటి వసతులతో పాటు పార్కింగ్ ప్రదేశం కూడా ఉండాలి. హోమ్ స్టేలకు వచ్చిన పర్యాటకుల వివరాలు (గుర్తింపు కార్డులు, పాస్‌పోర్ట్) నమోదు చేసుకోవాలి. అవసమైనప్పుడు అధికారులు తనిఖీలు చేసేందుకు వీలుగా అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించారు. ఈ నేపథ్యంలో హోమ్‌స్టే విధానానికి త్వరితగతిన అనుమతులు లభించే అవకాశం ఉంది. ఆసక్తిగల ఇంటి ఓనర్లు దరఖాస్తు చేసుకునే సమయంలో.. గుర్తింపు, చిరునామా, ఆస్తి యాజమాన్య పత్రాలు, స్థానిక సంస్థల నుంచి నిరభ్యంతర పత్రం తదితర వివరాలు సమర్పించాలి. ఈ మేరకు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. స్థానిక పర్యాటక శాఖ అధికారులను కలిసి వివరాలు తెలుసుకోవచ్చు. దరఖాస్తు తర్వాత ఆంధ్రప్రదేశ్ టూరిజం అధికారులు ఇంటిని తనిఖీ చేస్తారు. అనంతరం అప్రూవల్ సర్టిఫికెట్ ఇస్తారు. ఆ తర్వాత లైసెన్స్ మంజూరు చేస్తారు. లైసెన్స్ వచ్చిన తర్వాత.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం వసతులు కల్పించాలి. కాగా, అరకు, విశాఖపట్నం, కోనసీమ, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో.. గిరిజన, వారసత్వ, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో హోంస్టేలను అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో ఇప్పటికే దాదాపు 30 పర్యాటక కేంద్రాలను అధికారులు గుర్తించారు. అందులో అమరావతి ఆలయం,బౌద్ధ స్తూపం, కొండవీడు, కోటప్పకొండ,నాగార్జునకొండ, సత్రశాల, దైద, ఎత్తిపోతల తదితర ప్రాంతాలు ఇన్నాయి.

## పాస్‌వర్డులతో జాగ్రత్త..

# సులభంగా ఉంటే సైబర్ క్రిమినల్స్‌కు చిక్కినట్టే!

### 2025లో వాడిన వాటిలో సులువైనవే ఎక్కువ





న్యూఢిల్లీ: ఆన్‌లైన్ అకౌంట్ పాస్‌వర్డు చాలా క్లిష్టంగా ఎవరూ ఊహించని విధంగా ఉండాలని సైబర్ క్రైమ్ విభాగాలు హెచ్చరిస్తుంటాయి. అయితే ఓ తాజా అధ్యయనం ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2025లో ప్రజలు అత్యధికంగా 123456, అడ్మిన్, పాస్‌వర్డ్, ఇండియాఏ123 వంటి పాస్‌వర్డులను ఉపయోగించారు. దాదాపు 200 కోట్ల ఖాతాలకు చెందిన పాస్‌వర్డులు సులభంగా హ్యాకింగ్‌కు గురయ్యే రీతిలో ఉన్నట్లు కంపేరిటెక్ పరిశోధకులు వెల్లడించారు.
సర్వ సాధారణంగా అత్యధికులు ఉపయోగించే పాస్‌వర్డులలో అడ్మిన్, ఎఎ123456,123, 12345 67890, పాస్‌వర్డు ఉన్నాయి. 123 456 పాస్‌వర్డును 76 లక్షల మందికిపైగా ప్రజలు ఉపయోగిస్తున్నారు. కాగా, అడ్మిన్ అనే పాస్‌వర్డును 19 లక్షల మందికిపైగా వినియోగిస్తున్నారు. అత్య ంత సర్వసాధారణమైన 100 పాస్‌వర్డుల జాబితాలో ఇండియాఏ123కి 53వ స్థానం దక్కింది.
అత్యధికంగా వాడిన పాస్‌వర్డులివే: ప్రపంచవ్యాప్తంగా ప్రజలు అత్యధికంగా ఉపయోగిస్తున్న పాస్‌వర్డులలో 123456, 12345 678, అడ్మిన్, 1234, ఎఎ123456, 12345, పాస్‌వర్డు, 123, 1234567890 ఉన్నాయి.
ఎలాంటి పాస్‌వర్డ్ ఉండాలి?: ఆన్‌లైన్ అకౌంట్ సురక్షితంగా ఉండాలంటే పలు జాగ్రత్తలు తీసుకోవాలని మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు సూచిస్తున్నాయి. పాస్‌వర్డుకు కచ్చితంగా 12 అక్షరాలు ఉండాలి. ఇందులోని అక్షరాలు క్యాపిటల్, స్మాల్ లెటర్స్ కలగలిపి ఉండాలి. మధ్యలో సంఖ్యలు, చిహ్నాలు కూడా ఉండాలి. కుటుంబ సభ్యుడి పేరు, సొంత కంపెనీ వస్తువు, పోషించిన పాత్రల పేర్లు వంటివి పాస్‌వర్డులో ఉండకూడదు. ఫ్రాన్స్‌లోని లూవ్రా మ్యూజియంలో చోరీ కూడా సులువైన పాస్‌వర్డ్ కారణంగానే జరిగింది.

# రాజధానికి మీరు సలహాలు ఇవ్వొచ్చు..



**విజయవాడ,తెలంగాణ దిశ:** ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మించాలని కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వం హయాంలో అమరావతిలో ఆగిపోయిన పనులను పునరుద్ధరిస్తోంది. మరోవైపు, పూర్తిస్థాయి రాజధాని నిర్మాణం కోసం అవసరమయ్యే నిధుల సేకరణకు ప్రయత్నాలు చేస్తోంది. వివిధ ఆర్థిక సంస్థల నుంచి రూ. 32,500 కోట్ల నిధులు సేకరించేందుకు సిద్ధం అయింది. ఈ నేపథ్యంలో కేవలం అమరావతి మాత్రమే కాకుండా.. ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ ప్రణాళికలను రూపొందించడంలో ప్రజలను కూడా భాగస్వాములు కావాలని తాజాగా ప్రభుత్వం పిలుపునిచ్చింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత 'విజన్ 2047' డాక్యుమెంట్‌ను రూపొందించడంలో మాతో చేరండి అని ప్రజలను ఆహ్వానించింది.'విజన్ 2047' డాక్యుమెంట్‌ను రూపొందించడంపై ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్డీఏ) ఓ ప్రకటన చేసింది. అందులో.. ఏపీసీఆర్డీఏ ప్రపంచ స్థాయి రాజధాని ప్రాంతాన్ని నిర్మించేందుకు 'విజన్ 2047'ను రూపొందిస్తోందని తెలిపింది. విజన్ కార్యచరణలో భాగంగా, ప్రజలు, వివిధ భాగస్వాముల నుండి రాజధాని ప్రాంతీయ అభివృద్ధి సంస్థ పరిధి కోసం ఆలోచనలు, సూచనలు, ప్రాధాన్యతలు, అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపింది. సీఆర్డీఏ ప్రాంతం సుమారు 8600 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉందని తెలిపింది. ఇది దేశంలోనే అతిపెద్ద ప్రణాళికా ప్రాంతాలలో ఒకటని వెల్లడించింది. ఈ రాజధాని ప్రాంతంలో.. కృష్ణా, ఎన్‌టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాల్లోని 56 మండలాలను ఉన్నాయని వివరించింది. విజయవాడ, గుంటూరు, అమరావతి, మంగళగిరి? తాడేపల్లి లాంటి నగరాలతో పాటు 900కు పైగా గ్రామాలు రాజధాని పరిధిలో ఉన్నాయని పేర్కొంది. ఈ క్రమంలో ప్రజలు వెల్లడించే అభిప్రాయాలు.. ఏపీసీఆర్డీఏ బృహత్ప్రణాళిక (మాస్టర్ ప్లాన్ ), విజన్‌కు తోడ్పడతాయని సీఆర్డీఏ ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు ఒక గూగుల్ ఫామ్ తయారు చేసింది. ఈ ఫామ్ నింపి సీఆర్డీఏ ప్రాంతం అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రజలను కోరింది. కాగా, ఈ సర్వేలో భాగస్వాములు కావాలనుకునే వారు సీఆర్డీఏ వెబ్‌సైట్ (ఇ-తీటజీ.జీజూ.ఐనీల.తిని)లోకి వెళ్లి లింక్‌పై క్లిక్ చేయడం లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అభిప్రాయాలు తెలియజేయవచ్చు. గూగుల్ ఫామ్ ఇంగ్లీష్, తెలుగు భాషల్లో అందుబాటులో ఉంది. ఇక్కడ అడిగిన ప్రశ్నలకు టిక్ మార్క్ పెట్టి ప్రజలు తమ అభిప్రాయాలు తెలపవచ్చు. అయితే ఆంధ్రప్రదేశ్ వాసులు మాత్రమే కాకుండా.. విదేశాల్లో ఉన్నవారు.. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా, ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధిపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేయొచ్చు.
2028 నాటికి చట్టబద్ధత: రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల కార్యాలయాల నిర్మాణం జరుగుతోంది. బ్యాంకింగ్ రంగ సంస్థల కార్యాలయాల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన జరగనుంది. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ జరుగుతోంది.
అయితే గత అనుభవాల దృష్ట్యా అమరావతిని చట్టబద్ధత చేయాల్సిన అవసరం ఉంది. సిఆర్డిఏ చెబుతున్నట్టు ఐదు జిల్లాల పరిధిలో దాదాపు తొమ్మిది వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్న అమరావతికి పార్లమెంట్ ఆమోదముద్ర తక్షణ అవసరం. గత అనుభవాల దృష్ట్యా ఇది కీలకం కూడా. చట్టబద్ధత కల్పిస్తే.. అమరావతి అనే దానిని కదిలించలేరు కూడా. అయితే 2029 ఎన్నికల నాటికి అమరావతిని ఒక రూపానికి తెచ్చి ప్రజలకు ఓటు అడగాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అంటే కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేసి చట్టబద్ధత కల్పిస్తుందన్నమాట.
అమరావతి రాజధాని లో నవ నగరాలు నిర్మించాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అయితే గ్రేటర్ హైదరాబాద్ మాదిరిగా అమరావతిని నిర్మించి ప్రపంచంలోనే గుర్తింపు తీసుకురావాలన్నది ఆరాటంగా తెలుస్తోంది. అయితే 2014లో అందరి ఆమోదముద్రతో అమరావతి రాజధానిని ఎంపిక చేశారు చంద్రబాబు. పనులు కూడా ప్రారంభించారు. కానీ 2019లో అధికారం మారిపోయేసరికి మూడు రాజధానులు అంశం తెరపైకి వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతి రాజధాని నిర్మాణాన్ని నిర్వీర్యం చేసింది. దాని పర్యవసానాలు అందరికీ తెలిసిన విషయమే. భూములు ఇచ్చిన రైతులు రోడ్డెక్కారు. వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. అయితే వారి ప్రార్థనలు ఫలించి టిడిపి కూటమి వచ్చింది. లేకుంటే వారి పరిస్థితి ఎలా ఉంటుందో కూడా ఊహించలేం. వైసీపీ అధికారంలోకి వచ్చి ఉంటే అమరావతి అనేది పూర్తిగా నిర్వీర్యం అయిపోయేది. గత అనుభవాల దృష్ట్యా అమరావతి రాజధాని నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉంది కూటమి ప్రభుత్వం. అదే సమయంలో అమరావతిని కదిలించలేని స్థితిలోకి చేర్చాలని ఒక పట్టుదలతో ఉంది. అయితే అది 2028 లోనే చేయాలన్న తలంపుతో ఉంది. ఎందుకంటే ఆ సమయానికి అ మరావతి రాజధాని నిర్మాణం ఒక కొలిక్కి వస్తుంది. అమరావతికి ఒక రూపు తెచ్చి.. పార్లమెంటులో బిల్లు పెట్టాలని చూస్తోంది టిడిపి కూటమి ప్రభుత్వం. అలా ఆ బిల్లును ఆమోదించి.. అమరావతిని శక్తివంతమైన నగరంగా మార్చాలన్నది చంద్రబాబు ప్రణాళిక. తద్వారా ప్రజలకు గట్టి సంకేతాలు పంపించనున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా డ్యామేజ్ చేయనున్నారు. అసలు అమరావతి విషయంలో స్టాండ్ ఏంటి అని వైసిపి చెప్పుకోలేని స్థితికి తేనున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
ఏకపక్ష మద్దతు.. పార్లమెంటులో అమరావతి బిల్లు ప్రవేశ పెడితే ఏకపక్షంగా ఆమోద ముద్ర వేసే అవకాశం ఉంది. ఎందుకంటే అమరావతి రాజధానికి అన్ని పార్టీల మద్దతు ఉంది. ఒక్క వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్ప. అయితే ఆ పార్టీ జాతీయస్థాయిలో ఏ కూటమితో కూడా లేదు. తెలుగుదేశం, జనసేన ఎన్డీఏ కూటమిలో ఉంది. ఇండియా కూటమికి కాంగ్రెస్ నాయకత్వం వహిస్తోంది. వామపక్షాలు సైతం అదే కూటమిలో ఉన్నాయి. కాంగ్రెస్ తో పాటు వామపక్షాలు సైతం అమరావతి రాజధానికి జై కొట్టాయి.
దీంతో బిల్లు ప్రవేశపెట్టడమే తరువాయి చాలా సులువుగా ఆమోదముద్ర వస్తుంది. చంద్రబాబులో కూడా అదే ధీమా. ఇప్పుడు గాని చట్టబద్ధత కల్పిస్తే రాజకీయంగా ఎటువంటి ప్రయోజనం ఉండదు. 2028 నాటికి అమరావతికి ఒక తుది రూపు తెచ్చి.. పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలన్న ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# ఇక ఏఐ సాయంతో తిరుమల దర్శనం




**తిరుమల,తెలంగాణ దిశ:**తిరుమల శ్రీవారి దర్శనం కోసం కొండకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే సాంకేతికత సాయంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే ఆలోచనలు చేస్తోంది. అందులో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో శ్రీవారి భక్తులకు రెండు గంటల్లోగా దర్శనం కల్పించే ఆలోచనను టీటీడీ గతంలో చేసింది. అయితే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావటం తో పాటుగా కొంతమంది నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. ఏఐ సాయంతో రెండు గంటల్లో శ్రీవారి దర్శనం గురించి విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియపై కాస్త వెనుకడుగు వేసిన టీటీడీ .. మరోసారి ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించే ఆలోచన చేస్తోంది. ఈ విషయాన్ని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. ఈ క్రమంలోనే ఏఐ సాయంతో తిరుమల శ్రీవారి దర్శనం గురించి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ ద్వారా రెండు గంటల్లో శ్రీవారి దర్శనం కల్పించాలనే ఆలోచన గతంలో చేసినట్లు బీఆర్ నాయుడు వివరించారు. అయితే ఓ వర్గం నుంచి వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. టీటీడీ నూతన ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలో త్వరలోనే ఈ ఏఐ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కిస్తామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. తాము బాధ్యతలు చేపట్టిన తర్వాత తిరుమల అన్నప్రసాదాల్లో మార్పులు వచ్చాయని బీఆర్ నాయుడు చెప్పుకొచ్చారు.భక్తులకు రుచికరమైన భోజనం అందిస్తున్నామని.. లడ్డూ ప్రసాదంలోనూ చాలా మార్పులు చేశామన్నారు. ప్రస్తుతం లడ్డూ ప్రసాదాలు 10 రోజులైనా నిల్వ ఉంటున్నాయని భక్తుల నుంచ్ స్పందన వస్తోందన్నారు. తిరుపతివాసులు మూడు వేల మందికి ప్రతి నెలా మొదటి మంగళవారం శ్రీవారి దర్శన భాగ్యం కల్పిస్తున్నామని వివరించారు. తిరుమల కాటేజీలకు దేవుడి పేర్లు పెట్టాలని నిర్ణయించామని.. టీటీడీలోని అన్యమతస్తులను కూడా కొంతమందిని ఉద్యోగాల నుంచి తొలగించామన్నారు. తిరుమల శ్రీవారి బ్రేక్ దర్శనాల విషయంలోనూ మార్పులు చేశామని బీఆర్ నాయుడు వివరించారు. ఉదయం పదిన్నరకు ఉండే బ్రేక్ దర్శనాలను తెల్లవారు జామున మార్చామన్నారు. శ్రీవాణ ట్రస్టు కింద 5 వేల ఆలయాల నిర్మాణం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో గుడులు, భజన మందిరాలు నిర్మించనున్నట్లు తెలిపారు.మరోవైపు తిరుమల తరహాలో టీటీడీ ఆధ్వర్యంలోని ఆలయాల్లో నిత్యాన్నదానం అమలు చేయనున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరించారు. తిరుపతి తిరుమల మధ్యన ఎలక్ట్రికల్ బస్సులు నడుపుతామని టీటీడీ ఛైర్మన్ చెప్పుకొచ్చా రు. కేంద్ర మంత్రి కుమారస్వామి టీటీడీకి 100 ఎలక్ట్రిక్ బస్సులు ఇస్తామన్నారని.. వాటినితిరుపతి, తిరుమల మధ్య నడపనున్నట్లు తెలిపారు. దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలో శ్రీవారి ఆలయం నిర్మిస్తామన్న టీటీడీ ఛైర్మన్.. కరీంనగర్‌లో రూ. 30 కోట్లతో,దుబ్బాకలో రూ. 4.5 కోట్లతో శ్రీవారి ఆలయాలు నిర్మించనున్నట్లు వెల్లడించారు.

# నానికే కాపుకాస్తారా..!



**విజయవాడ,తెలంగాణ దిశ:** మాజీ మంత్రి పేర్ని నానికి క్రేజ్ ఉంది. మచిలీపట్నం లో ఆయనకు కాపు సామాజికవర్గం కూడా అండగా ఉండేది. ఎక్కువ మంది కాపులు ఆయనకు మద్దతిచ్చేవారు. కానీ 2019 ఎన్నికల తర్వాత పేర్ని నాని పై కాపుల్లో వ్యతిరేకత మొదలయింది. పేర్ని నాని ఒంటికాలిపై పవన్ కల్యాణ్ పై లేస్తుండటం, ఆయనపై విమర్శ లు చేస్తుండటంతో సొంత సామాజికవర్గం నానికి దూరమయిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. పేర్ని నాని మంచి వాగ్దాటి ఉన్న నేత. నాడు జగన్ కేబినెట్ లో మంత్రిగా ఉండి పవన్ కల్యాణ్ ను టార్గెట్ చేయడం వల్లనే కాపు సామాజికవర్గం నానికి దూరమయింద న్నది వాస్తవం. అంతకు ముందు ఆయనకు బలంగా నిలిచిన వర్గం కూడా ఆయన వైపు నిల్చోకపోవడానికి జనసేన కారణమని చెప్పాలి.. కొన్ని పరిణామాలు పేర్ని నానికి అనుకూలంగా మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. పవన్ కల్యాణ్ గత పదహారు నెలల నుంచి కొంత మౌనంగా ఉండటంతో పాటు కందుకూరు ఘటనపై మాట్లాడక పోవడంతో పాటు గతంలో మచిలీపట్నంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం, నామినేటెడ్ పదవుల్లో తమకు అన్యాయం జరిగిందని భావించడం, మచిలీపట్నంలో ప్రస్తుతం కాంట్రాక్టులు, నామినేటెడ్ పదవులు కొందరికే దక్కుతుండటంతో నానికి అనుకూలంగా క్రమంగా కాపులు కూడా మారుతున్నారన్నది వాస్తవం. ఇది ఎవరు అవునన్నా కాదన్నా నిజం. అక్కడి పరిస్థితుల్లో మార్పులు కనిపిస్తున్నాయి స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే ఖచ్చిత ంగా ఫలితాలు నాని వైపు ఉంటాయన్న విశ్లేషణలు వెలువడుతు న్నాయి. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికతోనూ ఫలితాలు ఉంటాయని అంటున్నారు. మచిలీపట్నం జనసేనలో మాత్రం కూటమి సర్కార్ పై కొంత అసహనం ఏర్పడింది. అందులో నూ టీడీపీపై కొంత వ్యతిరేకతతో ఉన్నారు. పవన్ కల్యాణ్ కూడా పార్టీ కోసం కష్టపడిన తమను పట్టించుకోవడం లేదన్న అభిప్రాయంలో ఉన్నారు. అయితే దీనిని పేర్ని నాని రాజకీయంగా ఉపయోగించుకునే అవకాశముంది. మంత్రి కొల్లు రవీంద్ర కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణంపై రోడ్డు విస్తరణ పనులు కూడా నాని బయటకు తెచ్చి తన వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# సెహభాష్... తెలంగాణ పోలీస్




**హైదరాబాద్,తెలంగాణ దిశ:** మనం అనేక సందర్భాల్లో చెప్పుకున్నాం కదా.. పోలీసుల మీద రాజకీయ ఒత్తిడి లేకుంటే.. పోలీసులను వారి పని వారిని చేసుకొనిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయని.. అసాంఘిక శక్తుల ఆటలు సాగవని.. సంఘవిద్రోహశక్తుల దుర్మార్గాలు ముందుకెళ్లవని.. అలాంటి పనిని తెలంగాణ పోలీసులు చేసి చూపించారు. యావత్తు దేశం మొత్తం తమ వైపు చూసుకునేలా చేశారు. నేటి స్మార్ట్ కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దుర్మార్గులు రకరకాల విధాలుగా ప్రజలను మోసం చేస్తున్నారు.. మెసేజ్లు పంపించడం.. లింకులు సెండ్ చేయడం.. డిజిటల్ అరెస్టులు.. మాదక ద్రవ్యాలు దొరికాయని చెప్పడం.. ఇలా రకరకాల విధానాల్లో మోసాలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు సైబర్ నేరగాళ్లు.. ఇలా అమాయకులను మోసం చేస్తే కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు. పైగా ఈ డబ్బులను రకరకాల విధానాలలో మార్చేస్తూ తమ వద్దకు తెచ్చుకుంటున్నారు. ఇలా దొంగిలించిన డబ్బులను మ్యూల్ ఖాతాల సహాయంతో తమ వద్దకు తెచ్చుకుంటున్నారు.. అయితే ఈ తరహా మోసాలు ఇటీవల అధికంగా పెరగడంతో తెలంగాణ సైబర్ పోలీసులు దృష్టి సారించారు. అంతే కాదు సరికొత్త ఆపరేషన్ చేసి యావత్ దేశం మొత్తం తమ వైపు చూసేలా చేశారు.తెలంగాణ పోలీసులకు ఇటీవల కాలంలో సైబర్ ఫిర్యాదులు పెరిగిపోయాయి. తెలంగాణ సైబర్ పోలీసులు ఎన్ని విధాలుగా అవగాహన కల్పించినప్పటికీ నేరాలు తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల తమకు అందిన ఫిర్యాదుల ఆధారంగా తెలంగాణ సైబర్ పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.. 95 కోట్ల స్కాం బయటపడింది.. అంతేకాదు 81 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.. తెలంగాణలో వచ్చిన సైబర్ మోసంపై పోలీసులు దర్యాప్తునుమొదలుపెట్టారు.. మోసానికి పాల్పడిన వ్యక్తులు మొత్తం కూడా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, కర్ణాటకలో ముఠాలుగా ఏర్పడ్డారని పోలీసుల విచారణలో తేలింది. ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ బ్యూరో దాడులు నిర్వహించింది. అరెస్టయిన వారిలో 17 మంది ఏజెంట్లు, ఏడుగురు మహిళలు, 58 మంది మ్యూల్ ఖాతాదారులు ఉన్నారు.నిందితుల నుంచి పోలీసులు 84 సెల్‌ఫోన్లతో పాటు 101 సిమ్ కార్డులు, 89 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

# బెంగళూరు జైల్లో ఖైదీలకు సర్వభోగాలు..!

బెంగళూరు: బెంగళూరు జైలులో సకలభోగాలు అనుభవిస్తున్న ఖైదీలకు సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. పలు తీవ్రమైన కేసుల్లో శిక్షలు పడిన ఖైదీలు, రేపిస్టులు, నేరస్తులు జైలులో తెగ ఎంజాయ్ చేయడం ఈ వీడియోలో కనిపిస్తుంది. కొందరు దర్జాగా మొబైల్ ఫోన్లలో మాట్లాడుతుంటే.. మరికొందరు ఎంచక్కా టీవీలు చూస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ఈ జైలులోని ఖైదీలు శిక్ష అనుభవిస్తున్న తీరు చూసి ప్రతి ఒక్కరూ నోరెళ్లబెడుతున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులోని ఖైదీల లగ్జరీ లైఫ్‌కు సంబంధించిన దృశ్యాలు ఇవి. ఈ వీడియోలో కనిపించిన ఖైదీల్లో 1996 నుంచి 2022 మధ్య 20 మంది మహిళలపై అత్యాచారం చేయడంతోపాటు వారిలో 18 మందిని హత్య చేసిన కేసులో దోషిగా తేలిన ఉమేష్ రెడ్డి కూడ ఉన్నాడు. ఇతగాడికి కోర్టు తొలుత మరణశిక్ష విధించింది. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో అది 30 ఏళ్ల కఠిన కారాగార శిక్షగా మారింది. ప్రస్తుతం బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఉమేష్ రెడ్డి మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ, టీవీలో ఐటెం సాంగ్ చూస్తూ కనిపించాడు. అతని వద్ద 2 ఆండ్రాయిడ్ ఫోన్లు, మరో కీ ప్యాడ్ మొబైల్ ఫోన్‌లు ఉన్నాయి. ఉమేష్ రెడ్డిని ఉంచిన సెల్‌లో ఒఇఆ టీవీ సదుపాయం కూడా ఉంది. ప్రముఖ నటి రన్యా రావు గోల్డ్ స్మగ్లింగ్ కేసులో అరెస్టైన తరుణ్ రాజు కూడా ఇదే జైలులో సకల భోగాలు అనుభవిస్తున్నాడు. అతడున్న జైలు గదిలో స్వయంగా వంట చేసుకునే సదుపాయం కూడా ఉంది. వీరివద్దనే కాదు ఇతర ఖైదీల వద్ద కూడా మొబైల్ ఫోన్లు ఉండటం విశేషం.కన్నడ నటుడు దర్శన్‌కు జైలు అధికారులు ప్రాథమిక సౌకర్యాలు నిరాకరించగా, ఇక్కడి చాలా మంది కరడుగట్టిన క్రిమినల్స్, రేపిస్టులకు మాత్రం ఎటువంటి పరిమితులు లేకుండా కటకటాల వెనుక విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నట్లు ఈ వీడియో ద్వారా తెలుస్తుంది. వీరితో పాటు ఐసిస్ ఉగ్రవాది జుహాద్ హమీద్ షకీల్‌కు చెందిన మరో వీడియో కూడా ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది. అతడు జైలు లోపల గాడ్జెట్‌లు, ఇతర సౌకర్యాలు యదేచ్ఛగా అనుభవిస్తున్నాడు.

# అమరావతి చుట్టూ ఓఆర్ఆర్



**రాజమండ్రి,తెలంగాణ దిశ:**అమరావతి రాజధాని లో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించి అడుగులు శరవేగంగా పడుతున్నాయి. అందుకు సంబంధించి కీలక అప్డేట్ ఒకటి వచ్చింది. అమరావతికి మణిహారంగా నిలవనున్న ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఎందుకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియలో కదలిక వచ్చింది. 11 మండలాల్లోని 40 గ్రామాల్లో భూసేకరణకు కసరత్తు ప్రారంభం అయింది. ఈ భూ సేకరణ ప్రక్రియను పర్యవేక్షించే ప్రత్యేక అధికారిగా శ్రీవాత్సవ నియమితులైన సంగతి తెలిసిందే. ఆయన ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. భూ సేకరణకు సంబంధించిన అంశాలపై ఫోకస్ చేశారు. దాదాపు 12 ప్యాకేజీలుగా విభజించి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించాలన్నది ప్రణాళికగా తెలుస్తోంది. మొత్తం ఐదు జిల్లాల్లో అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు కోసం భూ సేకరణ చేపట్టనున్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు మాదిరిగా దీనిని నిర్మించనున్నారు. 11 మండలాలలోని 40 గ్రామాల్లో ఔటర్ రింగ్ రోడ్డు కోసం భూసేకరణ చేపట్టాల్సి ఉంది. దాదాపు 4792 ఎకరాలను సమీకరించనున్నారు. ప్రధానంగా దుగ్గిరాల, కొల్లిపర, తెనాలి, గుంటూరు తూర్పు, చేబ్రోలు, వట్టిచెరుకూరు, గుంటూరు పశ్చిమ, తాడికొండ, మేడికొండూరు, మంగళగిరి, పెదకాకాని మండలాల్లో భూ సేకరణ చేపట్టనున్నారు. ఇప్పటికే అన్ని మండలాల రెవెన్యూ అధికారులకు షెడ్యూల్ ఇచ్చారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులు నేషనల్ హైవే అధికారులతో కలిసి ఏడు మండలాల్లో పర్యటన పూర్తి చేశారు. అమరావతి రాజధాని చుట్టూ 190కిలోమీటర్ల పొడవుతో అవుటర్ రింగ్ రోడ్డు నిర్మించాలన్నది ప్రణాళిక. ఈ ప్రాజెక్టు కోసం జాతీయ రహదారుల సంస్థ డిపిఆర్ సిద్ధం చేసింది. ఢిల్లీలోని జాతీయ రహదారుల సమస్త ప్రధాన కార్యాలయానికి పంపింది. దాదాపు 25 వేల కోట్ల రూపాయలతో ఈఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేయాలన్నది ప్రణాళిక. హైదరాబాద్కు మణిహారంగా నిలిచే ఔటర్ రింగ్ రోడ్డు పొడవు 158 కిలోమీటర్లు. అంటే అమరావతి రాజధాని లో 190 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తే.. అమరావతికి ఇది మణిహారంగా మారనుంది. 140 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూ సేకరణ జరగనుంది. ఐదు జిల్లాల్లో జరిగే భూ సేకరణ కోసం ఒక్కో జిల్లాకు ఒక్కో జాయింట్ కలెక్టర్ ను నియమించింది. త్వరలో భూ సమీకరణ ప్రారంభం కానుంది.

# యాక్టివ్ పాలిటిక్స్ లో ధర్మాన



**శ్రీకాకుళం,తెలంగాణ దిశ:**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఇటీవల సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు యాక్టివ్ అయ్యారు. అయితే ఆయన ఓటమి నుంచి చేరుకోవడానికి ఏడాదికి పైగా పట్టింది. అయితే ఒకే ఒక షరతుతో ఆయన పార్టీలో యాక్టివ్ అయినట్లు ప్రచారం నడుస్తోంది. సుదీర్ఘకాలం ఉమ్మడి ఏపీలో రాజకీయాలు చేశారు ధర్మాన ప్రసాదరావు. అయితే గత ఎన్నికల్లో ఒక సామాన్య సర్పంచిచేతిలో ఓడిపోయారు. అదిమొదలు తీవ్ర నైరాస్యంలోకి వెళ్లిపోయారు. ఇప్పుడు ఉన్నఫళంగా యాక్టివ్ అయ్యారు. దీంతో రకరకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆది నుంచి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ఆయన భిన్న వైఖరి అనుసరిస్తూ వచ్చారు. ఒకానొక దశలో పార్టీకి దూరమవుతారని ప్రచారం నడిచింది. కానీ కూటమిలో ఆప్షన్ లేకపోవడంతోనే ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారని తెలుస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలోనే ఏకధాటిగా 12 సంవత్సరాలపాటు మంత్రిగా ఉన్నారు ధర్మాన ప్రసాదరావు పైగా రెవెన్యూ లాంటి కీలక శాఖ బాధ్యతలను చూశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ సమయంలో కాంగ్రెస్ మంత్రిగా ఉండేవారు. జగన్మోహన్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే 2014 లో గత్యంతరం లేని స్థితిలో ఆయన జగన్ చెంతకు వెళ్లారు. అయినా ఓటమి పలకరించింది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉన్న వేవ్ దృష్ట్యా చాలా యాక్టివ్ గా పని చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో తనకు మంత్రి పదవి ఖాయమని అంచనా వేశారు. కానీ జగన్మోహన్ రెడ్డి ఆయనకు మంత్రి పదవి ఇవ్వలేదు. సోదరుడు కృష్ణదాస్కు ఇవ్వడంతో తీవ్ర మనస్థాపంతో మూడేళ్లపాటు గడిపారు. దీంతో విస్తరణలో ధర్మాన ప్రసాదరావు కు ఛాన్స్ ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి. అయితే జగన్ విషయంలో విభిన్న వైఖరితో ఉన్న ధర్మాన మంత్రిగా తన మార్కు చూపించుకోలేకపోయారు. 2024 ఎన్నికల్లో ఓడిపోయేసరికి జగన్ నాయకత్వంలో పనిచేసేందుకు ముందుకు రాలేదు కూడా.

ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ అయ్యారు ధర్మాన ప్రసాదరావు. అయితే ఈ యాక్టివ్ వెనుక కుమారుడు రామ్ మనోహర్ నాయుడు భవితవ్యం ఉన్నట్లు తెలుతోంది. 2024 ఎన్నికల్లోనే తన కుమారుడికి టిక్కెట్ ఇవ్వాలని కోరారు ధర్మాన ప్రసాదరావు. అందుకు జగన్ అంగీకరించలేదు. ఎన్నికల్లో ఓడిపోవడంతో శ్రీకాకుళం నియోజకవర్గంలో వైసిపి గెలుపు కష్టం అన్న ఆలోచనకు వచ్చారు. పార్టీ ఆవిర్భవించి మూడుసార్లు ఎన్నికలు జరిగితే ఒకసారి మాత్రమే గెలిచింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. 2024 ఎన్నికల్లో రికార్డు స్థాయిలో టిడిపి అభ్యర్థి 52,000 ఓట్ల తేడాతో గెలిచారు. అంటే ఏ స్థాయిలో ఇక్కడ తెలుగుదేశం అనుకూల వాతావరణం ఉందో గ్రహించారు ధర్మాన ప్రసాదరావు. అందుకే టిడిపి తో పాటు కూటమి పార్టీలో చేరేందుకు ప్రయత్నించారు. అది వర్కౌట్ కాకపోవడంతో వైసీపీలో కొనసాగుతున్నట్లు విశ్లేషణలు ఉన్నాయి.

అయితే ధర్మాన ప్రసాదరావు విషయంలో పార్టీ హైకమాండ్ అల్టిమేట్ జారీ చేసినట్లు తెలుస్తోంది. పార్టీలో కొనసాగుతారా? లేదా? లేకుంటే ప్రత్యామ్నాయం చూసుకోమంటారా? అని గట్టిగానే కోరినట్లు తెలుస్తోంది. అప్పుడే ధర్మాన ప్రసాదరావు ఒక షరతు పెట్టినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు రామ్ మనోహర్ నాయుడు కు టికెట్ ఇస్తే పార్టీలో యాక్టివ్ అవుతానని ధర్మాన ప్రసాదరావు చెప్పినట్లు తెలుస్తోంది. అధినేత జగన్మోహన్ రెడ్డి అంగీకరించడంతోనే ధర్మాన యాక్టివ్ అయినట్లు సమాచారం. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# కొలికపూడి తగ్గట్లే...



**విజయవాడ,తెలంగాణ దిశ:** తెలుగుదేశంపార్టీలో ఇటీవల విభేదాలు వీధిన పడుతున్నాయి. వాటిని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తోంది నాయకత్వం. నిన్ననే టిడిపి క్రమశిక్షణ కమిటీ ఎదుటకు వచ్చారు విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు. కొద్ది రోజుల కిందట ఈ ఇద్దరి మధ్య మాటల యుద్ధం నడిచిన సంగతి తెలిసిందే. దీనిపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ నేపథ్యంలో టిడిపి క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరయ్యారు. వేర్వేరుగా హాజరై వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఇది జరిగిన తరువాత కూడా ఓ పరిణామం టిడిపి నాయకత్వానికి షాక్ ఇచ్చింది. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఓ కార్యక్రమంలో ఎంపీ కేసినేని చిన్నిని విస్మరించడం వివాదం కొనసాగుతుందే తప్ప.. ఫుల్ స్టాప్ పడలేదని అర్థం అవుతుంది. విజయవాడ ( ఎంపీగా గెలిచారు కేసినేని చిన్ని. అదే సమయంలో తిరువూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు కొలికపుడి శ్రీనివాసరావు. టిడిపిలో నెలకొన్న పరిణామాలతో ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు కేసినేని నాని. ఆయనకు ప్రత్యామ్నాయంగా ఆయన సోదరుడు చిన్నిని ప్రోత్సహించింది టిడిపి నాయకత్వం. నాని వైసీపీలో చేరి ఆ పార్టీ ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగారు. చిన్ని టిడిపి అభ్యర్థిగా పోటీ చేశారు. తన పార్లమెంట్ స్థానం పరిధిలోని తిరువూరు టిక్కెట్ను కొలికపూడి శ్రీనివాసరావుకు ఇవ్వాలని సిఫారసు చేశారు. ఇద్దరూ గెలిచారు. కానీ తరచూ తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు వివాదాస్పదంగా మారారు. సొంత పార్టీ శ్రేణులు సైతం ఆయనను వ్యతిరేకిస్తూ హై కమాండ్కు ఫిర్యాదు చేశాయి. ఈ తరుణంలో తిరువూరు సమన్వయ బాధ్యతలను కేసినేని చిన్నికి అప్పగించింది టిడిపి నాయకత్వం. అయితే తనను విస్మరించి మాజీమంత్రి జవహర్ ను తెరపైకి తెచ్చారని చిన్ని పై అనుమానం పెంచుకున్నారు శ్రీనివాసరావు. అప్పటినుంచి వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే కేవలం అక్కడ సమన్వయ బాధ్యతలను అప్పగిస్తే.. మరింత జఠిలం చేశారని ఎంపీ చిన్ని పై టిడిపి నాయకత్వం ఆగ్రహంగా ఉంది. కొద్ది రోజుల కిందట ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సంచలన ఆరోపణలు చేశారు. అసెంబ్లీ టికెట్ కోసం ఎంపీ చిన్ని తన వద్ద ఐదు కోట్లు డిమాండ్ చేశారని సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అది మొదలు రచ్చ ప్రారంభం అయింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో ఆ ఇద్దరూ టిడిపి క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరయ్యారు. కొలికపూడికి ఇదే లాస్ట్ ఛాన్స్ అని ప్రచారం నడిచింది. అయితే క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరైన శ్రీనివాసరావు చంద్రబాబు పట్ల గౌరవ భావాన్ని ప్రకటించారు. ఆయన ఆదేశాల మేరకు నడుచుకుంటానని చెప్పుకొ చ్చారు. దీంతో ఈ వివాదంముగిసిందని అంతా భావించారు. కానీ లోకేష్ ఆదేశాల మేరకు ప్రజాదర్బార్ నిర్వహించారు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు ప్రజా దర్బార్ నిర్వహించకపోవడంపై లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు ప్రజా దర్బార్ నిర్వహించారు. కానీ అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎంపీ కేశినేని చిన్ని ఫోటో లేదు. దీంతో ఎంపీ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే కొలికపూడి సంకేతాలు ఇచ్చినట్లు అయింది.

# యాసంగి సాగేనా?



**ఆదిలాబాద్,తెలంగాణ దిశ:** ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా వానకాలంలో అధిక వర్షాల కారణంగా పంటలు నష్టపోగా, యాసంగి సాగు ముందుకు సాగుతుందనే అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. వానకాలంలో భారీగా వర్షాలు కురవడంతో సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు నిండు కుండలుగా మారాయి. సాధా రణ వర్షపాతం 1070.4 మిల్లీ మీటర్లు కాగా 1493.6 మిల్లీ మీటర్లుగా నమోదైంది. వానకా లం నష్టాన్ని యాసం గిలో పూడ్చుకుందామని ఆశించిన రైతులకు నిరాశ తప్పడం లేదు. పత్తి, సోయాబిన్ అమ్మకాలు జరుగుతుండగా.. సీసీఐ, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతుల నుంచి మద్దతు ధరతో రెండు పంటలు కొనుగోలు చేస్తున్నది.

అమ్మకాల్లో ఇబ్బందులు: ఈ ఏడాది రైతులు పండించిన పత్తి క్వింటాలుకు రూ.8110, సోయాబిన్ క్వింటాలుకు రూ.5328 గా ప్రభుత్వం ప్రకటించింది. వచ్చిన కొద్ది పంటను మద్దతు ధరతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముదామని ఆశతో వచ్చిన రైతులకు నిరాశ తప్పడం లేదు. పంటలో తేమ శాతం ఎక్కువ ఉందని సీసీఐ పత్తిని కొనుగోలు చేయడానికి నిరాకరిస్తున్నది. కపాస్ కిసాన్ యాప్‌లో ఎకరాకు ఏడు క్వింటాళ్లు మాత్రమే సీసీఐకి విక్రయించుకొనే అవకాశం ఉంది. సోయాబిన్ అమ్మకంలో తేమ సమస్యలు ఉండగా.. ఎకరాకు ఏడు క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటున్నారు. దీంతో రైతులు మిగతా పంటను ప్రైవేటు వ్యాపారులకు విక్రయించుకోవాల్సి వస్తున్నది. ప్రైవేటులో పత్తి క్వింటాలుకు రూ.6800, సోయాబిన్ రూ.4300 వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ పంట కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల కారణంగా రైతులు అమ్ముకోలేక, ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నారు.

పెట్టుబడుల కోసం తిప్పలు: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతుబంధు పథకం రైతులకు వరంగా మారింది. ఏటా రెండు సీజన్‌లకు ముందుగానే పంట పెట్టుబడి డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేవి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పేరిట ఈ పథకం అమలు చేస్తుండగా.. రైతులకు పెట్టబడి సాయం అందడం లేదు. దీంతో ఈ సీజన్‌లో రైతు భరోసా అందుతుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రైతులు అప్పులు చేసి సాగు చేయాల్సి వస్తున్నది. దళారుల వద్ద వానకాలం సాగుకు తీసుకున్న అప్పులు రైతులు చెల్లించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది యాసంగిలో 1.90 లక్షల ఎకరాల్లో రైతులు యాసంగి సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. పత్తి, సోయాబిన్, మక్క పంటలు చేతికి రాగా.. రెండో పంటగా జొన్న, శనగ, గోధుమ, పల్లి వేస్తారు. పంట నష్టంతోపాటు పత్తి, సోయాబిన్ అమ్మకాల్లో ఇబ్బందుల కారణంగా యాసంగి పెట్టుబడికి ఇబ్బంది పడుతున్నారు.

మంత్రి హామీ ఇచ్చినా అందని పరిహారం: ఆగస్టులో భారీ వర్షాల కారణంగా 20,548 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. పత్తి 15,103 ఎకరాలు, సోయాబిన్ 2900, కంది 1845, మొక్కజొన్న 660, ఇతర పంటలు 100 ఎకరాల్లో నష్టపోయినట్లు నివేదికలు తయారు చేశారు. ఆగస్టు 19న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. అధికారులతో సమావేశం నిర్వహించి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. విలేకరుల సమావేశంలో మాట్లాడిన మంత్రి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. మంత్రి ప్రకటనతో కొంతమేర ఊరట లభిస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. మంత్రి పర్యటించి దాదాపు రెండున్నర నెలలు గడుస్తున్నా ఇంతవరకు రైతులకు ఎలాంటి పరిహారం అందలేదు.

# రేకుర్తి కంటి ఆసుపత్రి సేవలు అమోఘం

## సెంటినరీ కాలనీ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు మారుతి




**కమాన్ పూర్,తెలంగాణ దిశ:** రేకుర్తి కంటి ఆసుపత్రి సేవలుఅమోఘం అనిలయన్స్ క్లబ్ ప్రతినిధుల ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్ అన్నారు. కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి మరియు వైస్ చైర్మన్ చిదుర సురేష్ ఆధ్వర్యంలో 320+జిల్లా పరిధిలోని 92 లయన్స్ క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులతో సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా గవర్నర్ లయన్ కోదండ రాజు సింహరాజు, ఫస్ట్ డిస్టిక్ వైస్ ప్రెసిడెంట్ మోర బద్రేశం, సెకండ్ డిస్టిక్ వైస్ ప్రెసిడెంట్ గుటక చంద్ర ప్రకాష్ , డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్స్ సింగిరెడ్డి వాసుదేవ రెడ్డి, గాలిపెల్లి వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రేకుర్తి హాస్పిటల్ లో ఉచిత ఆపరేషన్ చేస్తూనే మెల్లకన్ను, రెటీనా మొదలకు శస్త్రచికిత్సలను పేద ప్రజల అవసరాల దృష్ట్యాతక్కువ ఖర్చుతో అన్ని రకాల కంటి ఆపరేషన్లు అందిస్తూ రేకుర్తి కంటి ఆసుపత్రి చేస్తున్న సేవలను అతిథులు అభినందించారు. ఈ సేవలను ప్రతి లయన్స్ క్లబ్ తమ ప్రాంత ప్రజలకు తెలియజేసి, కంటి సమస్యల పరిష్కారానికి సహకరించాలని వారు కోరారు.

చైర్మన్ కొండ వేణుమూర్తి గారు హాస్పిటల్ మొత్తం చూపిస్తూ, కంటి ఆపరేషన్ కోసం ఆసుపత్రిలోని ఉపయోగించే ఆధునిక మిషనరీ, టెక్నాలజీ వివరాలను చూపిస్తూ అవగాహన కల్పించారు.

లయన్స్ క్లబ్ సెంటర్ కాలనీ అధ్యక్షుడు మేకల మారుతి మాట్లాడుతూ, రేకుర్తి కంటి ఆసుపత్రి ద్వారా ఇప్పటికే తమ ప్రాంతంలో 500 మందికి పైగా ప్రజలు కంటి ఆపరేషన్లు చేయించుకుని సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేష్ గార్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అడ్మినిస్ట్రేటివ్ డాక్టర్ శరణ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వార్నింగ్ లతో దారికొచ్చేనా?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కసి మీద ఉన్నారు. పార్టీ నేతల మధ్య విభేదాలను తొలగించేందుకు ఆయన నేరుగా రంగంలోకి దిగుతున్నారు. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో నేతల మధ్య తగాదాలను పరిష్కరించాలన్న భావనలో ఉన్నారు. నేతల మధ్య తలెత్తుతున్న విభేదాలు చివరకు పార్టీ ఉనికికే ప్రశ్నార్థకంగా మారనున్నాయి. క్యాడర్ కూడా రెండుగా విడిపోవడంవల్ల ప్రత్యర్థులు లాభపడతారు. ఆ అవకాశం ఇవ్వకూడదన్న విషయం చంద్రబాబుకు తెలియంది కాదు. అందుకే ఎక్కడ ఏచిన్న వివాదం తలెత్తినా ఆయన నేరుగా ఎంట్రీ ఇచ్చి విభేదాలను పరిష్కరించేందుకు సిద్ధమవుతున్నారు. నివేదికలు కోరుతున్నారు.

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో... అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అక్కడ ప్రభాకర్ చౌదరికి, ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ కు మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. సీటు దక్కకపోయినా తాను దగ్గుబాటి ప్రసాద్ విజయం కోసం పనిచేసినా గెలిచిన తర్వాత తనఅనుచరులను అణగదొక్కుతున్నారన్న అభిప్రాయం ప్రభాక్ చౌదరిలో ఉంది. అదేసమయంలో ఆయన జూనియర్ ఎన్టీఆర్ సినిమాపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారి పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. రాష్ట్రంలోని జూనియర్ ఎన్టీఆర్ అభిమానులంతా ఏకమై అనంతపురం ఎమ్మెల్యే నివాసం ఎదుట ఆందోళనకు దిగారు. దీని వెనక ప్రభాకర్ చౌదరి ఉన్నారంటూ దగ్గుబాటి ప్రసాద్ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరినీ పిలిచి చంద్రబాబు నాయుడు క్లాస్ పీకినట్లు తెలిసింది. ...ఎమ్మెల్యేలకు, కొందరు మంత్రులకు వార్నింగ్ కూన రవికుమార్ విషయంలోనూ... ఇక శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కూడా వివాదాల్లో చిక్కుకుంటున్నారు. ఆయనకు అక్కడ మంత్రి అచ్చెన్నాయుడుకు మధ్య పొసగడం లేదు. అదే సమయంలో తాజాగా ఒక ప్రిన్సిపల్ బదిలీ వివాదంలో కూన రవికుమార్ చిక్కుకున్నారు. ప్రిన్సిపల్ ఆత్మహత్యాయత్నం చేయడంతో అది పార్టీకి ఇబ్బందికరంగా మారింది. కూన రవికుమార్ కొంత దూకుడుగా ఉంటారు. ఇసుక దందాలు, కేజీబీవీ ప్రిన్సిపల్ సౌమ్య వివాదంతో ఆయన పార్టీని ఇబ్బందుల పాటు చేస్తున్నారు. మంత్రి పదవి ఆశించిన కూన రవికుమార్ కు కనీసం కేబినెట్ ర్యాంక్ పదవి దక్కకపోవడంతో ఆయన అసహనంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో కూన రవికుమార్ నుంచి కూడా చంద్రబాబు నివేదికను కోరినట్లు తెలిసింది. దీనిపై త్వరలో కూనను పిలిచి చంద్రబాబు మాట్లాడతారని తెలిసింది. చదవకుండా సంతకాలు పెట్టేస్తారా: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి వర్గ సమావేశంలో మంత్రుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫైళ్లను పరిశీలించి దానిపై సంతకం చేయాలని అన్నారు. ఫైలు పూర్వాపరాలను కూడా తెలుసుకుని క్లియర్ చేయడం మంచిదని సూచించినట్లు తెలిసింది. అలాగే తమకు ఇన్ ఛార్జి పదవి అప్పగించిన జిల్లాల్లో ఎమ్మెల్యేల పనితీరును కూడా గమనించాలని ఆయన కోరినట్లు తెలిసింది. కొందరు ఎమ్మెల్యేల వ్యవహార శైలి పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా తయారైందని, వారిని కంట్రోల్ చేసే బాధ్యత మంత్రులు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. ప్రధానంగా ఎమ్మెల్యేలు తీరు మార్చుకోకుంటతానేస్వయంగా జోక్యం చేసుకోక తప్పదని హెచ్చరించినట్లు తెలిసింది. తప్పు చేసిన వారు ఎవరైనా వదిలేదిలేదని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు తమ పనితీరును మెరుగుపర్చుకోవాలని, జనంలో ఉండాలని, అంతే తప్ప నిత్యం వివాదాల్లో కాదన్న విషయం గుర్తుంచుకోవాలని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

# సినిమా..

## హాలీవుడ్‌లో కూడా వివక్ష!



అగ్ర కథానాయిక దీపికా పదుకొణె హాలీవుడ్ ఇండస్ట్రీపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. భారతీయ నటీనటుల పట్ల అక్కడి వారు వివక్ష చూపిస్తుంటారని, అది అందరికీ తెలిసిన విషయమే అని పేర్కొంది. భారతీయ సినిమాలో తిరుగులేని గుర్తింపును దక్కించుకున్న ఈ మంగళూరు సోయగం హాలీవుడ్‌లో కూడా సత్తా చాటుతున్నది. 'త్రిబుల్ ఎక్స్: రిటర్న్ ఆఫ్ గ్జాండర్ కేజ్' వంటి చిత్రాలతో పాటు పలు అంతర్జాతీయ ఉత్పత్తులకు ఆమె బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ గ్లోబల్ ఐకాన్‌గా పేరు తెచ్చుకుంది. ఓ ఇంటర్నేషనల్ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో దీపికా పదుకొణె హాలీవుడ్ ఇండస్ట్రీ గురించి మాట్లాడింది. 'అందరూ అనుకుంటున్నట్లుగా హాలీవుడ్‌లో ప్రతిదీ నిజాయితీగా, సక్రమంగా ఏమీ ఉండదు. భారతీయ నటీనటులు అక్కడ వివక్షను ఎదుర్కొం టారు. ముఖ్యంగా శరీర రంగు ఆధారంగా వివక్ష చూపిస్తుంటారు. ఉద్దేశ్యపూర్వకంగా అలాంటివి జరుగుతుంటాయి. స్కిన్ కలర్‌తో పాటు మన ఇంగ్లీష్ యాసపై కూడా అక్కడ చిన్నచూపు ఉంటుంది. అందుకే హాలీవుడ్‌లో అవకాశాలు దక్కించుకొని సక్సెస్ కావడం అంత సులభం కాదు. అయితే ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా సరే ఓ భారతీయురాలిగా నా గొంతును బలంగా వినిపించే ప్రయత్నం చేస్తుంటా. నా మూలాలను గౌరవించే వారితోనే పనిచేస్తానని నిక్కచ్చిగా చెబుతాను' అని దీపికా పదుకొణె పేర్కొంది. 'స్పిరిట్' 'కల్కి' వంటి పాన్ ఇండియా తెలుగు చిత్రాల నుంచి దీపికా పదుకొణె తొలగింపు వ్యవహారం జాతీయ స్థాయిలో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దీపికా పదుకొణె ప్రస్తుతం బాలీవుడ్, హాలీవుడ్ చిత్రాలపై దృష్టి పెడుతున్నది.

## కల నెరవేరింది



'పెద్ది' ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి' సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియా సన్సేషన్‌గా మారింది. మొత్తం 13 దేశాల్లో టాప్ ట్రెండింగ్‌లో ఈ పాట ఉందని, నాలుగు భాషల్లో కలిపి 53 మినియన్ ప్లస్ వ్యూస్‌ని ఈ పాట సాధించిందని, టాప్ చార్ట్స్‌లో నంబర్ వన్ స్థానంలో ఉందని మేకర్స్ చెబుతున్నారు. ఇదిలావుంటే.. శనివారం రాత్రి హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో ఏ.ఆర్.రెహమాన్ మ్యూజికల్ నైట్ జరిగింది. ఈ కార్యక్రమంలో అగ్ర హీరో రామ్‌చరణ్ సందడి చేశారు. ఆయనతోపాటు కథానాయిక జాన్వీకపూర్, 'పెద్ది' దర్శకుడు బుచ్చిబాబు సానా కూడా హాజరై ఆడియన్స్‌లో మరింత జోష్ నింపారు. 'పెద్ది' సినిమాలోని 'చికిరి చికిరి' సాంగ్ లైవ్ పెర్ఫార్మెన్స్ ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రామ్‌చరణ్ మాట్లాడుతూ 'రెహ్మాన్‌సార్ సంగీతంతో భాగమవ్వాలనేది నా చిన్ననాటి కల. అది నా 'పెద్ది' సినిమాతో నెరవేరినందుకు చెప్పలేనంత సంబరంగా ఉంది.' అని ఆనందం వెలిబుచ్చారు. 'పెద్ది' ఒక డిఫరెంట్, యూనిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా అని జాన్వీ కపూర్ అన్నారు. వచ్చే ఏడాది మార్చి 27న 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది.

## సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించిన అనుపమ.. ఎందుకంటే?



సోషల్ మీడియా వేదికగా తనను వేధింపులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ నటి అనుపమ పరమేశ్వరన్ కేరళ సైబర్ క్రైమ్ పోలీసుల్ని ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఓ ఇన్‌స్టా ప్రొఫైల్ కొన్ని రోజుల క్రితం నా దృష్టికొచ్చింది. నేను, నా ఫ్యామిలీ, నా సహనటులే లక్ష్యంగా అసత్య ప్రచారాలతో కూడిన పోస్టులు ఆ ప్రొఫైల్‌లో కనిపించాయి. అందులో కొన్ని మార్ఫింగ్ ఫొటోలు కూడా ఉన్నాయి. నాపై ద్వేషంతో కొన్ని ఫేక్ అకౌంట్లను కూడా ఆ వ్యక్తి సృష్టిం చినట్టు తెలిసి షాకయ్యా. బాధపడ్డాను కూడా. ఈ వ్యవహారం శృతి మించకూడదనే పోలీసులను ఆశ్రయించా. వారు కూడా వెంటనే స్పందించారు. చట్టవ్యతిరేకమైన ఈ చర్యలకు పాల్పడ్డ వ్యక్తిని వారు సత్వరమే కనిపెట్టారు. అయితే.. బాధ కలిగించే విషయం ఏంటంటే.. ఈ తప్పు చేసిన వ్యక్తి ఓ స్త్రీ. పైగా ఆమె 20ఏళ్ల యువతి. ఆమెది చాలా చిన్నవయసు. అందుకే.. ఆమె భవిష్యత్ పాడవ్వకూడదని వివరాలు పంచుకోవడం లేదు.' అంటూ చెప్పుకొచ్చారు అనుపమ పరమేశ్వరన్.

## డబుల్ ఎలిమినేషన్ డ్రామా..

## బ్రతికిపోయిన భరణి, సాయి అవుట్!



బిగ్ బాస్ తెలుగు సీజన్ 9లో ఆదివారం ఎపిసోడ్ పూర్తి స్థాయిలో డ్రామా, ఎమోషన్స్‌తో నిండిపోయింది. రాము రాథోడ్ స్వయంగా హౌస్‌ను వీడిన తర్వాత కూడా మరో ఎలిమినేషన్ జరగడం షాక్ ఇచ్చింది. వైల్డ్ కార్డ్ కంటెస్టెంట్‌గా ఎంట్రీ ఇచ్చిన సాయి శ్రీనివాస్ ఈ వారం హౌస్ నుండి ఎలిమినేట్ అయ్యాడు. ఆడియన్స్ ఓటింగ్ ప్రకారం బాటమ్‌లో ఉన్న సాయి సీజన్‌కు గుడ్‌బై చెప్పాల్సి వచ్చింది. ఈ వారం దివ్య, సుమన్ శెట్టి రెబల్స్‌గా హౌస్‌లో సీక్రెట్ టాస్కులు చేశారు. వారి దొంగతనాలు, అల్లరి వీడియోలను నాగార్జున ప్రదర్శించారు. ముఖ్యంగా సుమన్ శెట్టి నటన అందరినీ ఆకట్టుకుంది. పాల ప్యాకెట్ దొంగతనం తర్వాత అమాయకంగా నటిస్తూ హౌస్‌మేట్స్‌ను మోసం చేసిన విధానం ప్రేక్షకులను, నాగ్‌ను కూడా ఇంప్రెస్ చేసింది. నాగార్జున, కంటెస్టెంట్స్‌ను విడివిడిగా పిలిచి టైటిల్ గెలవడానికి ఎవరు దగ్గరగా ఉన్నారు? ఎలిమినేషన్‌కు ఎవరు దగ్గరలో ఉన్నారు? అని అడిగారు. అందరి అభిప్రాయాల ప్రకారం తనూజ, ఇమ్మాన్యుయేల్ టైటిల్‌కు చేరువగా ఉన్నారని తేలింది. ఇద్దరికీ తలా 5 ఓట్లు వచ్చాయి. అదే సమయంలో భరణి, సాయి ఎలిమినేషన్ జోన్‌లో ఉన్నారని అందరూ పేర్కొన్నారు. నామినేషన్లలో ఉన్న కంటెస్టెంట్స్‌లో చివరికి భరణి, సాయి మిగిలారు. గార్డెన్ ఏరియాలో వీరిద్దరి ముందు రెండు బొమ్మ ట్రైన్స్‌తో టాస్క్ సెటప్ సిద్ధం చేశారు. ఎవరి ముందు ట్రైన్ టన్నెల్ నుంచి బయటకు రాకుండా ఆగిపోతే, ఆ కంటెస్టెంట్ ఎలిమినేట్ అవుతారని నాగ్ తెలిపారు. చివరికి సాయి ట్రైన్ ఆగిపోవడంతో, అతను ఎలిమినేట్ అయ్యాడు. తనూజ వద్ద ఉన్న గోల్డెన్ బజర్‌ను ఉపయోగిస్తే సాయి సేఫ్ అవుతాడు, భరణి అవుట్ అవుతాడు అని నాగార్జున ప్రకటించారు. కానీ తనూజ ఆ అవకాశాన్ని వదులుకుంది. దీంతో సాయి ఎలిమినేట్ కాగా, భరణి మరోసారి ఎలిమినేషన్‌గండం నుంచి తప్పించుకున్నాడు. ఈ ఎపిసోడ్‌తో బిగ్ బాస్ హౌస్‌లో ఫైనల్ రేస్‌కి సంబంధించిన క్లారిటీ వచ్చిందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. నాగార్జున మాటలతో తనూజ, ఇమ్మాన్యుయేల్ ఫైనలిస్టులుగా ఉండే సూచనలున్నాయని భావిస్తున్నారు. మొత్తం మీద, ఈ వారాంతం ఎపిసోడ్ బిగ్ బాస్ సీజన్ 9లో అత్యంత ఆసక్తికరమైన మలుపుగా మారింది.

## విజయ్ తనయుడు డెబ్యూ మూవీ.. ఆకట్టుకుంటున్న ఫస్ట్ లుక్ పోస్టర్



టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ మరోసారి పవర్ ప్యాక్డ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అయితే ఈ సినిమాతోనే తమిళ స్టార్ విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇప్పటికే షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, తాజాగా చిత్ర బృందం టైటిల్ మరియు ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. సినిమా టైటిల్‌ను 'సిగ్మా (SIGMA)'గా ఫిక్స్‌చేశారు. విడుదలచేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ బంగారం, నగదు కట్టలపై చేతికి కట్టు కట్టుకుని సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లల్లో కనిపిస్తున్న యాంగర్, ఇంటెన్సిటీ ఈ మూవీ టోన్‌ను స్పష్టంగా చెబుతోంది. సందీప్ ఇప్పటివరకు చేసిన రోల్స్ కంటే భిన్నంగా, ఈసారి పూర్తి స్థాయి యాక్షన్ ప్యాక్డ్ అవతారంలో కనిపించనున్నారు. ఫ్యాన్స్ ఈ లుక్‌పై ఫిదా అవుతున్నారు. సమాచారం ప్రకారం, సిగ్మా ఒక ట్రెజర్ హంట్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. సస్పెన్స్, యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ మూవీ విజువల్‌గా గ్రాండ్‌గా ఉండబోతోందని చిత్ర బృందం చెబుతోంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రాజెక్ట్ ప్రారంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. తమిళ స్టార్ దళపతి విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తుండటం మరింత స్పెషల్. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్,విజువల్స్ విషయంలో ఆయన చూపుతున్నప్రత్యేక దృష్టి సినీ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. తొలి సినిమానే పాన్ ఇండియా రేంజ్‌లో ప్లాన్ చేయడం ద్వారా ఆయన సీరియస్ ఫిల్మ్‌మేకర్‌గా కనిపిస్తున్నారు. 'మైఖేల్', 'టెనెట్' తరహాలో ఆ యాక్షన్–ఇంటెన్స్ జానర్‌లో సిగ్మా సినిమా సందీప్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవబోతుందని ట్రేడ్ సర్కిల్స్ అభిప్రాయం. "When Greed Meets Guts" అనే ట్యాగ్‌లైన్ పోస్టర్‌లో కనిపించడం సినిమాపై ఆసక్తి మరింత పెంచింది. సందీప్ కిషన్ – జాసన్ సంజయ్ కాంబినేషన్‌లో వస్తున్న 'సిగ్మా' త్వరలోనే థియేటర్స్‌లో సందడి చేయబోతోంది. ట్రెజర్ హంట్, హై వోల్టేజ్ యాక్షన్, ఎమోషన్ కలగలిపిన ఈ మూవీ 2025లో టాలీవుడ్‌లో బిగ్ బ్లాస్టర్ అవ్వడం ఖాయం అని సినీ వర్గాలు చెబుతున్నాయి!

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215